E-KABURU E-PAPER

# ఈ-కబురు

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

@ekaburu.com

(తేదీ) 15-09-2025 (వారం) సోమవారం హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com



హైదరాబాద్‌లో కుండపోత వాన » 3లో


జీఎస్టీ సంస్కరణలు దీపావళి ముందే ఎందుకంటే..

» 4లో




కిస్ మీ ఇడియట్ అంటోన్న శ్రీలీల.

» 5లో




ఏడాది ఆఖర్లో ప్రేమ మొదలు

» 5లో



ఐపీఎల్ కాదు.. దేశం ముఖ్యం

» 6లో



# జూబ్లీహిల్స్.. మనదే!

» కాంగ్రెస్‌కే అనుకూలమని సర్వేలన్నీ చెబుతున్నాయ్

» అయినా ఉప ఎన్నికను తేలిగ్గా తీసుకోవద్దు.. ఇక్కడ గెలుపుతో గ్రేటర్‌లోనూ బలపడతాం

» భవిష్యత్తుకూ ప్రోత్సాహకంగా ఉంటుంది.. సానుభూతినే నమ్ముకున్న బీఆర్ఎస్

» నగర అభివృద్ధికి ఆ పార్టీ చేసిందేమీ లేదు.. హైదరాబాద్ అభివృద్ధిలో బీజేపీ పాత్రే లేదు

» పార్టీ కేంద్రీకృతంగా ప్రచారం చేయండి.. సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

» జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై డివిజన్ ఇన్‌చార్జుల సమావేశంలో సీఎం రేవంత్ దిశానిర్దేశం



ఈకబురు, హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు సంబంధించి తాజా సర్వేలన్నీ కాంగ్రెస్ పార్టీకే అనుకూలంగా ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. అయినా ఆషామాషీగా తీసుకోవద్దని, గెలుపే లక్ష్యంగా అందరూ సమన్వయంతో పని చేయాలని ఆ నియోజకవర్గ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ డివిజన్ ఇన్‌చార్జులకు సూచించారు. జూబ్లీహిల్స్‌లో గెలుపుతో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనూ కాంగ్రెస్ పార్టీ బలపడుతుందన్నారు. భవిష్యత్తు పాలనకు ఇది ప్రోత్సాహకంగా ఉంటుందని, జీహెచ్ఎంసీ ఎన్నికల్లో పార్టీకి మరింత ఉత్సాహాన్నిస్తుందని అన్నారు. హైదరాబాద్ శివారు జిల్లాలపైనా ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు.

తరువాయి 2లో

# పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులకు కాంగ్రెస్ మద్దతు



ఈకబురు , మంగళ్‌దోయీ: మన సైన్యానికి అండగా నిలవాల్సిన కాంగ్రెస్ పార్టీ.. పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదులకు మద్దతిస్తోందని ప్రధాని మోదీ ఆరోపించారు. చొరబాటుదారులను, జాతి వ్యతిరేక శక్తులను ఆ పార్టీ రక్షిస్తోందని విమర్శించారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో ఈ విషయం రుజువైందని పేర్కొన్నారు. అస్సాంలో ప్రధాని మోదీ ఆదివారం మంగళ్‌దోయీ, నుమాలీగఢ్‌లలో రూ.18,530 కోట్ల విలువైన పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం ప్రసంగించారు.

తరువాయి 2లో

# వలసలపై అట్టుడికిన బ్రిటన్

» 'యునైటెడ్ ది కింగ్‌డమ్' పేరిట లండన్‌లో భారీ ర్యాలీ

» ఆందోళనలో 1.50 లక్షల మంది

» వలసదారులను వెనక్కి పంపాలంటూ నినాదాలు

» నిరసనకు ఎలాన్ మస్క్ మద్దతు



తరువాయి 2లో

# పాకిస్తాన్‌పై భారత్ ఘనవిజయం

» 7 వికెట్లతో టీమిండియా గెలుపు

» రాణించిన కుల్దీప్, అక్షర్

» మెరిసిన సూర్యకుమార్, అభిషేక్ శర్మ

» శుక్రవారం ఒమన్‌తో చివరి లీగ్ మ్యాచ్

తరువాయి 6లో



## పౌరుల ప్రాణాల కంటే పాక్‌తో క్రికెట్ ముఖ్యమా: ఒవైసీ

» 2లో





## 17 నుంచి పోషణ మాస మహోత్సవం

» 2లో

# బంద్‌పై ప్రతిష్టంభన!

» ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలతో అర్ధరాత్రి వరకు ప్రభుత్వం చర్చలు

» ఫీజు బకాయిలు చెల్లించకపోతే సోమవారం నుంచి కాలేజీలు బంద్ చేస్తామన్న యాజమాన్యాలు

» బకాయిలు ఏకకాలంలో చెల్లించలేమని, విడతల వారీగా చెల్లిస్తామన్న ప్రభుత్వం

» సమ్మె విరమించమని కోరాం.. వారు సానుకూలంగా స్పందించారన్న భట్టి



» 2లో



## తెలంగాణ విమోచన ఘట్టం.. గొప్ప పోరాటం

» గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

» మజ్లిస్ అంటే కాంగ్రెస్, భారాసలకు భయం: కిషన్‌రెడ్డి

ఈకబురు కంటోన్మెంట్, : తెలంగాణ విమోచన ఘట్టం చరిత్ర కాదని, తమ పరువు, ప్రతిష్ఠల కోసం ఇక్కడి ప్రజలు చేసిన గొప్ప పోరాటమని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ పేర్కొన్నారు. సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో ఈనెల 17న కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించనున్న విమోచన దినోత్సవంలో భాగంగా కేంద్ర సమాచారశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఛాయాచిత్ర ప్రదర్శనను ఆదివారం గవర్నర్ ప్రారంభించారు. అనంతరం ప్రత్యేకంగా రూపొందించిన వర్చువల్ మ్యూజియాన్ని ఆవిష్కరించిన ఆయన మాట్లాడుతూ మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలు హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని నిర్వహిస్తున్న నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కూడా ఈ వేడుకలను అధికారికంగా నిర్వహించేందుకు ముందుకురావాలని సూచించారు. తెలంగాణ విమోచన కోసం ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులు, చేసిన పోరాటాలపై రూపొందించిన వర్చువల్ మ్యూజియం తరహాలోనే తమ రాష్ట్ర చరిత్రను సైతం చిత్రీకరించాలని త్రిపుర ముఖ్యమంత్రికి సూచిస్తాన

తరువాయి2లో

# ఎనీ ప్లేస్.. ఎనీ సిట్యుయేషన్ జై కపిధ్వజ్!



ఈకబురు, పర్వతాలు, అడవులు, నదులు, మంచు లోయలు, నీరు, ఎడారులు, చిత్తడి నేలలు.. ఇలా ఎక్కడికైనా ఆ వాహనం వెళ్లగలదు. ఇన్ని విభిన్న వాతావరణ పరిస్థితుల్లోనూ పనిచేసే సామర్థ్యమున్న ఈ వాహనం పేరు కపిధ్వజ్. ఇటీవలే ఉత్తరాఖండ్, జమ్మూకశ్మీర్, పంజాబ్ వరదల వేళ ఇది వందల మంది ప్రాణాలను కాపాడింది. సహాయక సామగ్రిని చేరవేసింది. మంచుతో కూడిన సియాచిన్, లద్దాఖ్ వంటి పర్వత ప్రాంతాలలో కపిధ్వజ్‌తో భారత సైన్యం ప్రస్తుతం గస్తీ నిర్వహిస్తోంది. చండీగఢ్‌లోని ఈ వాహన తయారీ కర్మాగారాన్ని 'ఈటీవీ భారత్' ఇటీవల సందర్శించింది. కపిధ్వజ్‌ను జేఎస్‌డబ్ల్యూ గెక్కో మోటార్స్ సంస్థ తయారు చేస్తోంది. దీనిలో వినియోగిస్తున్న 90 శాతానికిపైగా భాగాలు భారత్‌లోనే తయారవుతుండటం విశేషం. ఇప్పటివరకు 120 కపిధ్వజ్ వాహనాలను భారత సైన్యం కొనుగోలు చేసింది. కపిధ్వజ్‌లో డ్రైవర్, అసిస్టెంట్ డ్రైవర్‌తో పాటు వెనుక భాగంలో ఏడుగురు కూర్చోవచ్చు. సీట్లను తొలగించి, సామగ్రిని నింపుకోవచ్చు.

» 2లో

## ఎస్ఎల్‌బీసీ ఘటన జరిగి 200 రోజులైనా ప్రభుత్వాల స్పందన కరవు: కేటీఆర్

» 2లో



మొదటి పేజీ తరువాయి

# వలసలపై అట్టుడికిన బ్రిటన్



లండన్: వలసలకు వ్యతిరేకంగా బ్రిటన్ అట్టుడుకుతోంది. దేశంలోకి ప్రవేశిస్తున్న వలసదారులను వెనక్కు పంపేయాలని డిమాండ్ చేస్తూ రాజధాని లండన్‌లో ఆందోళనకారులు భారీ స్థాయి ర్యాలీ నిర్వహించారు. దీంట్లో దాదాపు 1.101.50 లక్షల మంది పాల్గొన్నారు. సెంట్రల్ లండన్‌లో శనివారం జరిగిన ఈ ర్యాలీ బ్రిటన్ చరిత్రలోనే అతి పెద్దదని మెట్రోపాలిటన్ పోలీసులు పేర్కొన్నారు. వలసలు, ఇస్లామీకరణకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న కార్యకర్త టామీ రాబిన్సన్ ఆధ్వర్యంలో 'యునైట్ ది కింగ్‌డమ్' పేరిట ఈ ప్రదర్శన జరిగింది. మరోవైపు జాత్యాహంకారానికి వ్యతిరేకంగా 'స్టాండ్ అప్ టు రేసిజమ్' అనే నిరసన కూడా చేపట్టారు. దీనిలో 5వేల మంది పాల్గొన్నారు. సమాజంలో సమానత్వం, ఐక్యతను ప్రోత్సహించాలని వారు కోరారు. పలు జాతులు, సంస్కృతుల ప్రజలు దేశంలో సామరస్యంతో జీవించాలని పిలుపునిచ్చారు. ఈ రెండు గ్రూపుల మధ్య ఎలాంటి గొడవలు జరగకుండా ఉండేందుకు భారీగా పోలీసులు మోహరించారు. నిరసనకారులను చెదరగొట్టేందుకు వారు తీవ్రంగా ప్రయత్నించారు. ఈ క్రమంలో నీళ్ల సీసాలు, పలు రకాల వస్తువులతో ఆందోళనకారులు పోలీసులపై దాడులు చేశారు. ఈ ఘటనలో 26 మంది అధికారులు గాయపడినట్లు సమాచారం. వారిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. 25 మందిని అరెస్టు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ అల్లర్లలో పాల్గొన్నవారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని అసిస్టెంట్ కమిషనర్ మాట్ ట్విస్ట్ తెలిపారు. తాజా పరిణామాలను బ్రిటన్ అంతర్గత వ్యవహారాల మంత్రి షబానా మహమూద్ ఖండించారు.

**అమెరికా, ఇజ్రాయెల్ జెండాలు**

వలస వ్యతిరేక ప్రదర్శనల్లో అమెరికా, ఇజ్రాయెల్ జెండాలను కొందరు నిరసనకారులు ప్రదర్శించారు. వలసదారులను వెనక్కి పంపేయాలంటూ, ప్రధాని కీర్ స్టార్మర్‌ను విమర్శిస్తూ ఆందోళనకారులు నినాదాలు చేశారు. 'వారిని తిరిగి పంపించేయండి', 'మా దేశాన్ని మాకు తిరిగివ్వండి', 'పడవలను ఆపండి' అని వలస వ్యతిరేక నినాదాలు రాసి ఉన్న ప్లకార్డులు ప్రదర్శించారు. మరికొంత మంది 'మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్' అని రాసి ఉన్న టోపీలు ధరించారు.

**పోరాడండి.. లేదంటే చనిపోతారు: మస్క్**

రాబిన్సన్ ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీని ఉద్దేశించి మస్క్ వర్చువల్‌గా మాట్లాడారు. 'బ్రిటన్ పౌరుడిగా ఉండటం గొప్ప విషయం. కానీ, దేశం నాశనం అవడం నేను ఇప్పుడు చూస్తున్నా. చిన్న కోతగా ఇది మొదలైంది. కానీ, ఇప్పుడు భారీగా అక్రమ వలసలతో నిండిపోయింది. ఇది ఇలానే కొనసాగితే మీరు హింసను కోరుకోకపోయినా.. విధ్వంసం మీ వరకు వస్తుంది. ఇప్పుడు మీ వద్ద ఉన్నవి రెండే మార్గాలు. తిరిగి పోరాడండి.. లేదంటే చనిపోతారు. ఇదే నిజమని నేను అనుకుంటున్నా' అని మస్క్ అన్నారు. ఈ సందర్భంగా ప్రధాని కీర్ స్టార్మర్ నేతృత్వంలోని ప్రభుత్వం దిగిపోవాలని మస్క్ డిమాండ్ చేశారు. బ్రిటన్‌లో ప్రభుత్వ మార్పు జరగాలని తాను భావిస్తున్నట్లు తెలిపారు. వెంటనే పార్లమెంటును రద్దు చేసి.. మళ్లీ ఎన్నికలు నిర్వహించాలన్నారు. మస్క్‌తో పాటు ఫ్రాన్స్‌కు చెందిన ఎరిక్ జెమ్మూర్, జర్మనీ (ఏఎఫ్‌డీ)కి చెందిన వలస విధానాల వ్యతిరేకి పీటర్ బైస్ట్రోన్ కూడా ఈ ర్యాలీని ఉద్దేశించి ప్రసంగించారు. అమెరికాలో ఇటీవల హత్యకు గురైన చార్లీ కిర్క్ ఉదంతాన్ని ప్రస్తావించారు. ఐరోపా దేశాల్లో తెల్లజాతీయులను వలసదారులు భర్తీ చేస్తున్నారన్న వాదనను ప్రముఖంగా పేర్కొన్నారు.

**వలసలపై ఎందుకు వ్యతిరేకత?**

ఇటీవల కాలంలో బ్రిటన్‌కు అక్రమ వలసలు భారీ ఎత్తున పెరిగాయి. ఈ ఏడాది ఇప్పటివరకు 28,000 మందికి పైగా వలసదారులు పడవల ద్వారా బ్రిటన్‌కు చేరుకున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. బ్రిటన్‌కు వచ్చే వారిలో చాలామంది ఆశ్రయం కోరుతూ వస్తున్నారు. వలసలు రికార్డు స్థాయికి చేరుకోవడంతో స్థానికుల్లో అసంతృప్తి పెరిగింది. ప్రభుత్వం వలసదారులను తాత్కాలికంగా హోటళ్లలో ఉంచుతోంది. ఈ క్రమంలో వాటి వెలుపల కొన్నినెలలుగా స్థానికుల నిరసనలు తెలుపుతున్నారు. వలసదారులు దేశ వనరులను వాడేస్తున్నారని, స్థానికుల ఉద్యోగాలను కొల్లగొడుతున్నారని నిరసనకారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే బ్రిటన్ ఆర్థిక వ్యవస్థ తీవ్ర కష్టాల్లో ఉండగా, అక్రమ వలసదారులు దేశానికి భారంగా మారారని ఆందోళనకారుల వాదన. వలసల వల్ల తమ జాతీయ గుర్తింపు, సాంస్కృతిక విలువలు ప్రమాదంలో పడుతున్నాయని భావిస్తున్నారు.

**ఆందోళనలకు తలొగ్గేది లేదు:** వలసలకు వ్యతిరేకంగా లండన్‌లో నిర్వహించిన భారీ ర్యాలీలో హింస చోటు చేసుకోవడాన్ని బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ తీవ్రంగా ఖండించారు. ఆందోళనలకు తలొగ్గే ప్రసక్తే లేదన్నారు.

**ఎవరీ టామీ రాబిన్సన్..**

లండన్‌లో వలస వ్యతిరేక ప్రదర్శనలకు ఆధ్వర్యం వహించిన టామీ రాబిన్సన్ అసలు పేరు స్టీఫెన్ యాక్స్లీ లెన్నాన్. జర్నలిస్టుగా పనిచేస్తున్న రాబిన్సన్.. యూకే ప్రభుత్వంలోని అవినీతిని బయటపెడతానంటూ పలుమార్లు పేర్కొన్నారు. ఆయనకు ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌తో సహా పలువురు ప్రముఖుల మద్దతు ఉంది.

# తెలంగాణ విమోచన ఘట్టం.. గొప్ప పోరాటం



సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో ఈనెల 17న కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించనున్న విమోచన దినోత్సవంలో భాగంగా కేంద్ర సమాచారశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఛాయాచిత్ర ప్రదర్శనను ఆదివారం గవర్నర్ ప్రారంభించారు. అనంతరం ప్రత్యేకంగా రూపొందించిన వర్చువల్ మ్యూజియాన్ని ఆవిష్కరించిన ఆయన మాట్లాడుతూ మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలు హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని నిర్వహిస్తున్న నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కూడా ఈ వేడుకలను అధికారికంగా నిర్వహించేందుకు ముందుకురావాలని సూచించారు. తెలంగాణ విమోచన కోసం ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులు, చేసిన పోరాటాలపై రూపొందించిన వర్చువల్ మ్యూజియం తరహాలోనే తమ రాష్ట్ర చరిత్రను సైతం చిత్రీకరించాలని త్రిపుర ముఖ్యమంత్రికి సూచిస్తానన్నారు.

కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రం ఆధ్వర్యంలో గత మూడేళ్లుగా నిర్వహిస్తున్న వేడుకలకు ఈసారి ముఖ్యఅతిథిగా రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ హాజరవుతారని తెలిపారు. కొత్తగా రూపొందించిన వర్చువల్ మ్యూజియం లింకును ప్రతిఒక్కరూ తమ సెల్‌ఫోన్లలో ఓపెన్ చేసుకుని చూడాలని కోరారు. మజ్లిస్ అంటే కాంగ్రెస్, భారాస నేతలకు భయమని, అందువల్లే ఆ పార్టీలు విమోచన దినోత్సవాన్ని నిర్వహించడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో ఎంపీ ఈటల రాజేందర్, భాజపా రాష్ట్రాధ్యక్షుడు రామచందర్‌రావు, ఎమ్మెల్సీలు మల్క కొమురయ్య, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

# జూబ్లీహిల్స్.. మనదే!



జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో ఆ నియోజకవర్గ పరిధిలోని డివిజన్లకు వివిధ కార్పొరేషన్ చైర్మన్లను ఇన్‌చార్జులుగా కాంగ్రెస్ నియమించిన సంగతి తెలిసిందే. ఆదివారం వారితో సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ సమావేశమయ్యారు. తొలుత డివిజన్ ఇన్‌చార్జుల నుంచి ముఖ్యమంత్రి ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారు. ఉప ఎన్నికలో అనుసరించాల్సిన వ్యూహాలు, ప్రణాళికలను ప్రాథమ్యాల వారీగా వివరించారు. సానుకూల దృక్పథంతో ముందుకెళ్లాలని, పోలింగ్ బూత్‌ల వారీగా ప్రచార ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. నియోజకవర్గ సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుందన్న భరోసా, కాంగ్రెస్ పార్టీతోనే నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమన్న నమ్మకాన్ని కల్పించాలన్నారు. ఈ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ సానుభూతినే నమ్ముకుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పదేళ్ల పాలనలో హైదరాబాద్ అభివృద్ధికి ఆ పార్టీ చేసిందేమీ లేదన్నారు. ఇక హైదరాబాద్ అభివృద్ధిలో బీజేపీకి ఎటువంటి పాత్ర లేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఇన్‌చార్జులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని, వ్యక్తి కేంద్రీకృతంగా కాకుండా.. పార్టీ కేంద్రీకృతంగానే ప్రచారం నిర్వహించాలని సూచించారు. ప్రచారంలో దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌పై, ఆయన కుటుంబంపై విమర్శలు చేయవద్దని, కేసీఆర్, కేటీఆర్‌లనే లక్ష్యంగా చేసుకోవాలని దిశానిర్దేశం చేశారు. ఈ ఎన్నికను ప్రభుత్వానికి సంబంధించిన ఎన్నికగా తీసుకోవాలని, పార్టీని గెలిపించాల్సిన గురుతర బాధ్యత ఇన్‌చార్జులపై ఉందన్నారు. క్షేత్రస్థాయి పరిస్థితులపై తాను ఎప్పటికప్పుడు సమాచారం తీసుకుంటానని చెప్పారు. అభ్యర్థి ఎంపిక అధిష్ఠానం పరిధిలో ఉందని సీఎం తెలిపారు. ప్రత్యేక బృందాలు.. అభిప్రాయ సేకరణ చేస్తున్నాయన్నారు.

మొదటి పేజీ తరువాయి

# పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులకు కాంగ్రెస్ మద్దతు



"1962లో చైనాతో యుద్ధ సమయంలో అస్సామీలకు అప్పటి ప్రధాని నెహ్రూ చేసిన గాయాలు ఇంకా మానలేదు. భూపేన్ హజారికా లాంటి సంగీత దిగ్గజాలను అవమానించడం ద్వారా ప్రస్తుత కాంగ్రెస్ నేతలు ఆ గాయాలపై ఉప్పు జల్లుతున్నారు. భూపేన్‌కు జరిగిన అవమానంతో నాకు తీవ్రంగా బాధ కలిగింది. కానీ ప్రజలే గురువులు. భాజపా చేసేది తప్పా.. ఒప్పా అనేది వారే తేలుస్తారు" అని ప్రధాని పేర్కొన్నారు. నుమాలీగఢ్‌లోని రిఫైనరీలో రూ.7,230 కోట్లతో నిర్మించనున్న పెట్రో ఫ్లూడిసెడ్ కాటలిటిక్ క్రాకర్ యూనిట్‌కు ప్రధాని శంకుస్థాపన చేశారు. గోలాఘాట్ జిల్లాలో రూ.5,000 కోట్లతో నిర్మించిన వెదురు ఆధారిత ఇథనాల్ ప్లాంటును ప్రారంభించారు. ఇది ప్రపంచంలోనే రెండో తరంలో నిర్మించిన తొలి బయో ఇథనాల్ ప్లాంట్.

ముడి చమురు దిగుమతుల తగ్గింపునకు కృషి

విదేశాల నుంచి ముడి చమురు, గ్యాస్ దిగుమతులను తగ్గించుకునేందుకు కృషి చేస్తున్నామని ప్రధాని మోదీ తెలిపారు. చమురు వెలికితీత, హరిత ఇంధన ఉత్పత్తిపై అధికంగా దృష్టి సారిస్తున్నామని వివరించారు.

# బంద్‌పై ప్రతిష్టంభన!

ఈకబురు, హైదరాబాద్: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలతో రాష్ట్ర ప్రభుత్వం జరిపిన చర్చల్లో ఎలాంటి స్పష్టత రాలేదు. ప్రైవేటు విద్యాసంస్థలన్నింటినీ మూకుమ్మడిగా మూసివేయాలని నిర్ణయించుకొని యాజమాన్యాలు ప్రభుత్వానికి సమ్మె నోటీసు ఇచ్చిన నేపథ్యంలో సర్కారు చర్చలకు ఉపక్రమించింది. ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలతో ప్రజా భవన్‌లో సమావేశమయ్యారు. ఇరుపక్షాల మధ్య నాలుగు గంటలపాటు జరిగిన చర్చల్లో ఎలాంటి స్పష్టత రాలేదని తెలిసింది.

ప్రభుత్వం నుంచి ఏళ్ల తరబడి ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు రాకపోవడంతో కళాశాలలు నడపటం కష్టంగా మారిందని, జీతాలు కూడా చెల్లించలేని పరిస్థితుల్లో ఉన్నామని యాజమాన్యాలు చెప్పాయి. తమకు రావాల్సిన బకాయిలన్నింటినీ వెంటనే విడుదల చేయాలని కోరాయి. అయితే ప్రభుత్వం నుంచి ఈ విషయంలో స్పష్టమైన హామీ రాలేదని యాజమాన్యాలు చెప్పాయి.

రాష్ట్ర ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల్లో ఫీజు బకాయిలు ఏకకాలంలో చెల్లింపు సాధ్యం కాదని, విడతల వారీగా చెల్లిస్తామని ప్రభుత్వం చెప్పింది. కళాశాలలను మూసివేయాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరింది. విద్యాసంస్థల డిమాండ్లను ఇప్పటికిప్పుడు నెరవేర్చడం సాధ్యం కాదని, కళాశాలలు మూసివేయడం వల్ల ప్రభుత్వ ప్రతిష్ట దెబ్బతింటుందని, నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని చెప్పింది. ఫీజుల చెల్లింపు విషయంలో ప్రభుత్వం నుంచి స్పష్టమైన భరోసా రాకపోవడంతో కళాశాలల మూసివేత నిర్ణయంపై వెనక్కు తగ్గే విషయంలో యాజమాన్యాలు కూడా ప్రభుత్వానికి స్పష్టత ఇవ్వలేకపోయినట్టు తెలిసింది. సోమవారం మధ్యాహ్నం మూడు గంటలకు ఇరుపక్షాల మధ్య మళ్లీ చర్చలు జరగనున్నాయి.

**సమస్యలను అర్థం చేసుకున్నాం**

మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఉన్నత విద్యామండలి చైర్మన్, ఉన్నత విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి, ప్రైవేట్ కళాశాలల యజమాన్యాలు ఆదివారం అయినప్పటికీ అందరం కలిసి సుదీర్ఘంగా నాలుగు గంటల పాటు చర్చించాం. చర్చలు సానుకూలంగా సాగాయి. కళాశాలల సమస్యలను అర్థం చేసుకున్నాం. సోమవారం ప్రభుత్వపరంగా నిర్ణయం తీసుకుంటాం. అప్పటివరకు సమ్మెను విరమించమని కళాశాలల యజమానులను కోరాం. వారు సానుకూలంగా స్పందించారు.

-సమావేశం అనంతరం భట్టి విక్రమార్క, డిప్యూటీ సీఎం

**ఉదయం ఏం జరిగిందంటే..**

అంతకుముందు ఉదయం ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు సమావేశమై కార్యాచణపై చర్చించాయి. సోమవారం నుంచి బంద్‌కు పాటించాలని నిర్ణయించాయి. ఫీజులు చెల్లించే వరకూ ఎట్టి పరిస్థితుల్లో కాలేజీలు తెరవొద్దని నిర్ణయించాయి. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఫెడరేషన్ ఆఫ్ అసోసియేషన్స్‌ఆఫ్ తెలంగాణ హయ్యర్ ఇన్‌స్టిట్యూషన్స్ (ఫతి) ప్రతినిధులు మీడియాకు తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం ఏడాది నుంచి వివిధ రూపాల్లో ఆందోళనలు చేస్తున్నాయి. గత ఏడాది పరీక్షలను బహిష్కరించాలని నిర్ణయించాయి కూడా. దీంతో ప్రభుత్వం స్పందించి వారితో చర్చలు జరిపింది. దశల వారీగా బకాయిలు చెల్లిస్తామని హామీ ఇచ్చింది. దీంతో అప్పుడు ఆందోళన నిర్ణయాన్ని యాజమాన్యాలు విరమించుకున్నాయి. తాజాగా శుక్రవారం యాజమాన్య ప్రతినిధులు ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డిని కలిసి నోటీసు ఇచ్చారు. సెప్టెంబర్ 30లోపు బకాయిలను విడుదల చేయకపోతే, ఆందోళనను ఉధృతం చేస్తామని ప్రకటించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం సర్కారు చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో విద్యాసంస్థలను మూకుమ్మడిగా మూసివేయాలని నిర్ణయించారు. బంద్ జరిగితే రాష్ట్రంలోని 1,500 పైచిలుకు ప్రైవేట్ ఇంజినీరింగ్, ఎంబీఏ, ఎంసీఏ, బీఈడీ, ఫార్మసీ, నర్సింగ్ కాలేజీలకు తాళాలు పడనున్నాయి. దాదాపు 10 లక్షల విద్యార్థులకు బోధన దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతుంది.

**ఓపిక నశించిందన్న ప్రతినిధులు**

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లిస్తుందని ప్రభుత్వంపై ఇన్నాళ్లు విశ్వాసం పెట్టుకున్నామని 'ఫతి' ప్రతినిధులు ఉదయం మీడియాకు చెప్పారు. ఇక ఓపిక నశించిందని, అందుకే ఆందోళన బాట పట్టామని తెలిపారు. టోకెన్లు జారీ చేసినప్పటికీ డబ్బులు ఇవ్వలేదన్నారు. దీంతో అన్ని కాలేజీల యాజమాన్యాలు ఉమ్మడి పోరుబాటకు సిద్ధమై ఫెడరేషన్ ఆఫ్ అసోసియేషన్స్‌ఆఫ్ తెలంగాణ హయ్యర్ ఇన్‌స్టిట్యూషన్స్‌ను ఏర్పాటు చేసుకున్నాయి. రూ.లక్ష కోట్ల డిపాజిట్లతో ప్రత్యేకంగా ట్రస్ట్ బ్యాంక్‌ను ఏర్పాటు చేయాలని ప్రైవేటు యాజామాన్యాలు సర్కారుకు ప్రతిపాదించాయి. ఈ లక్ష కోట్లలో సర్కారు వాటా పరిమితమేనని, సీఎస్సార్, కార్పస్ ఫండ్ వంటి ఇతర మార్గాల ద్వారానే ఈ నిధులను సేకరించవచ్చని సూచించాయి. లక్ష కోట్ల డిపాజిట్లపై వచ్చే ఏడు శాతం వడ్డీ (సుమారు రూ.3వేలకోట్లు)తో ఫీజు రీయింబర్స్ చేయొచ్చని ప్రతిపాతిదించాయి. దీనిని కూడా సర్కారు పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో అన్ని రకాల వృత్తి విద్యా కాలేజీల యాజమాన్యాలు గురువారం రాత్రి సమావేశమయ్యాయి. సెపెటంబర్ 15 నుంచి కాలేజీల నిరవధిక బంద్ పాటించాలని నిర్ణయించాయి. 'ఫతి' బాటలోనే తెలంగాణ డిగ్రీ, పీజీ కాలేజీల యాజమాన్య సంఘం (టీపీడీపీఎంఏ) కూడా కాలేజీల బంద్‌కు పిలుపునిచ్చింది. తాము ఈ నెల 16 నుంచి కాలేజీలను మూసివేస్తామని అసోసియేషన్ చెప్పింది.

# పౌరుల ప్రాణాల కంటే పాక్‌తో క్రికెట్ ముఖ్యమా: ఒవైసీ

ఈకబురు, హైదరాబాద్ అబిడ్స్,: 'పౌరుల ప్రాణాల కన్నా డబ్బే విలువైందా? బీసీసీఐకి ఈ ఒక్క మ్యాచ్ నుంచి రూ.2 వేల కోట్ల నుంచి రూ.3 వేల కోట్లు వస్తుండొచ్చు! మరి 26 మంది ప్రాణాలకు విలువలేదా?' అని ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ నిలదీశారు. పార్టీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని దారుస్సలాంలో శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. పాకిస్థాన్ ఉగ్రవాదం, భారత్‌పాక్ క్రికెట్ పోటీలు, కేంద్రంలోని భాజపా ప్రభుత్వ విధానాలపై తీవ్రంగా మండిపడ్డారు. పహల్గాంలో భారతీయులను ఉగ్రవాదులు దారుణంగా హత్య చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ నేపథ్యంలో భారత్‌పాక్‌ల మధ్య క్రికెట్ పోటీ తగదని పేర్కొన్నారు. దేశభక్తిపై ఉపన్యాసాలిచ్చే భాజపా... క్రికెట్ మ్యాచ్ విషయంలో రనౌట్, స్టంపౌట్ అయిందని ఎద్దేవా చేశారు. 26 మంది మృతుల కుటుంబాలతోనే తాముంటామని పేర్కొన్నారు. ఉగ్రవాదంపై చర్చలుండవని చెప్పిన ప్రధాని... పాకిస్థాన్‌తో మ్యాచ్‌లు ఆడటాన్ని ఎలా అంగీకరిస్తున్నారో చెప్పాలన్నారు. మహ్మద్ ప్రవక్త జీవితందయ, క్షమాగుణం, న్యాయం, సమానత్వం అనే మార్గాలను చూపిస్తుందన్నారు. ఐక్యత, శాంతి, సామాజిక సేవలపై ముస్లింలు దృష్టి పెట్టాలని పిలుపునిచ్చారు. ఇతర మతాలవారితో సామరస్యాన్ని పెంపొందించుకోవాలని... పేదలకు,అవసరమైనవారికి సహాయం చేయాలని ఒవైసీ కోరారు. మోదీ అసమర్థ పాలన వల్ల ఇటు చైనాతో, అటు అమెరికాతో దేశం తీవ్రనష్టం చవిచూడాల్సి వస్తోందని విమర్శించారు.

# ఎస్‌ఎల్‌బీసీ ఘటన జరిగి 200 రోజులైనా ప్రభుత్వాల స్పందన కరవు: కేటీఆర్

హైదరాబాద్: ఎస్‌ఎల్‌బీసీ ప్రమాద ఘటన జరిగి 200 రోజులైనా, కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల ఆరు మృతదేహాలను ఇప్పటికీ వెలికితీయలేదని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. ప్రభుత్వం బాధిత కుటుంబాలకు ఎలాంటి పరిహారమూ అందించలేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో చిన్నపాటి సమస్యలకే జాతీయ డ్యాం సేఫ్టీ అథారిటీ బృందాన్ని పంపి హంగామా సృష్టించిన కేంద్ర ప్రభుత్వం, ఎస్‌ఎల్‌బీసీ ఘటనపై దర్యాప్తునకు ఒక్క బృందాన్ని కూడా ఎందుకు పంపలేదని ప్రశ్నించారు. భారాస మళ్లీ అధికారంలోకి వచ్చాక.. 6 కుటుంబాలకు న్యాయం చేస్తామని, ఎస్‌ఎల్‌బీసీ సొరంగం కూలిపోవడానికి గల కారణాలపై విచారణ చేపడతామని కేటీఆర్ ప్రకటించారు.



# ఎనీ ప్లేస్.. ఎనీ సిట్యుయేషన్ జై కపిధ్వజ్!



సహాయక సామగ్రిని చేరవేసింది. మంచుతో కూడిన సియాచిన్, లద్దాఖ్ వంటి పర్వత ప్రాంతాలలో కపిధ్వజ్‌తో భారత సైన్యం ప్రస్తుతం గస్తీ నిర్వహిస్తోంది. చండీగఢ్‌లోని ఈ వాహన తయారీ కర్మాగారాన్ని 'ఈటీవీ భారత్' ఇటీవల సందర్శించింది.

కపిధ్వజ్‌ను జేఎస్‌డబ్ల్యూ గెక్కో మోటార్స్ సంస్థ తయారు చేస్తోంది. దీనిలో వినియోగిస్తున్న 90 శాతానికిపైగా భాగాలు భారత్‌లోనే తయారవుతుండటం విశేషం. ఇప్పటివరకు 120 కపిధ్వజ్ వాహనాలను భారత సైన్యం కొనుగోలు చేసింది.

కపిధ్వజ్‌లో డ్రైవర్, అసిస్టెంట్ డ్రైవర్‌తో పాటు వెనుక భాగంలో ఏడుగురు కూర్చోవచ్చు. సీట్లను తొలగించి, సామగ్రిని నింపుకోవచ్చు.

ఈ వాహనం మైనస్ 40డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతల్లోనూ సౌకర్యవంతంగా పనిచేయగలదు.

వెళుతున్న మార్గానికి అనుగుణంగా కపిధ్వజ్ టైర్లలోని గాలిని సర్దుబాటు చేసుకోవాలి. ఇందుకోసం వాహనం నుంచి డ్రైవర్ వెలుపలికి రానవసరంలేదు. లోపలే ఉన్న నాబ్‌తోనే ఈ పని పూర్తిచేయవచ్చు.

కపిధ్వజ్ 360డిగ్రీల కోణంలోనూ తిరుగగలదు.

ఈ వాహనం బాడీ కింది భాగం పడవలా ఉంటుంది. దీని టైర్లు నీటిలో తెడ్డులా పని చేస్తాయి. ఇది డీజిల్‌తో నడుస్తుంది. దీని ఇంధన ట్యాంకు సామర్థ్యం 327 లీటర్లు. దీని ఇంజిన్ హార్స్‌పవర్ 55. అంబులెన్స్, అగ్నిమాపక వాహన వెర్షన్‌లనూ జేఎస్‌డబ్ల్యూ గెక్కో సంస్థ సిద్ధం చేసింది.

**మోటార్లు బోట్లు వెళ్లలేని చోట్లకూ..**

"కపిధ్వజ్‌ను ఎడారులు, నదులు, పర్వతాలు, మంచులోయల్లోనూ విజయవంతంగా పరీక్షలు పూర్తిచేశాం. మోటార్ బోట్స్, ట్రాక్టర్లు వెళ్లలేని చోట్లకూ కపిధ్వజ్ వెళ్లగలదు. అందుకే దీని గురించి పారామిలిటరీ, జాతీయ విపత్తు స్పందన దళంతోనూ సంప్రదింపులు జరుపుతున్నాం" అని జేఎస్‌డబ్ల్యూ గెక్కో మోటార్స్ కంపెనీ డైరెక్టర్ జస్కీరత్ సింగ్ 'ఈటీవీ భారత్' ప్రతినిధికి వివరించారు.

# 17 నుంచి పోషణ మాస మహోత్సవం



మంత్రి సీతక్క

ఈ-కబురు, హైదరాబాద్: చిన్నారులు, మహిళలకు పోషకాహారంపై అవగాహన కల్పించేందుకు ఈ నెల 17 నుంచి అక్టోబరు 16 వరకు పోషణ మాస మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు శిశుసంక్షేమశాఖ మంత్రి సీతక్క తెలిపారు. జంక్‌ఫుడ్ వినియోగాన్ని తగ్గించడంతోపాటు చక్కెర, ఉప్పు, నూనెల వాడకం పరిమితిపై ప్రచార కార్యక్రమాలు జరిపించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమాల నిర్వహణ కోసం ప్రతి సమగ్ర శిశు అభివృద్ధి పథకం(ఐసీడీఎస్) ప్రాజెక్టుకు రూ.30వేలు, జిల్లాకు రూ.50వేల చొప్పున నిధులు విడుదల చేసినట్లు వివరించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలంటూ ప్రజాప్రతినిధులకు లేఖలు రాసినట్లు వెల్లడించారు. 'వోకల్ ఫర్ లోకల్' నినాదంతో గ్రామీణ ఉత్పత్తులను ప్రోత్సహిస్తామని, చిన్నపిల్లలకు మెరుగైన ఆహారపు అలవాట్లు అలవర్చుతామన్నారు.

# గోపనపల్లిలో బరితెగించిన బహుళ అంతస్థుల నిర్మాణ సంస్థలు

**రంగనాథస్వామి దేవాలయ భూములను ఆక్రమించి రాత్రికి రాత్రే రహదారి**

**అడ్డుకొని, రోడ్డును తొలగించిన దేవాదాయ శాఖ అధికారులు**

**పోలీసులకు పిర్యాదు**

ఈ-కబురు, శేరిలింగంపల్లి : గోపనపల్లిలో బహుళ అంతస్థుల ప్రైవేటు నిర్మాణ సంస్థలు బరితెగించాయి. అధికారుల జేబులు తడిపి, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణ అనుమతులు తెచ్చుకొని, భారీ బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపట్టిన సంస్థలు.. రహదారి కోసం దేవుని మాన్యం భూముల మీద కన్నేశాయి. నిర్మాణ సంస్థలు కూడబలుక్కొని రాత్రికి రాత్రే రంగనాథ స్వామి మాన్యం భూముల మీద పంజా విసిరాయి. తమ అక్రమాలను దేవుడు వచ్చి అడగడని భావించారో ఏమో ఏకంగా దేవుని మాన్యం భూములనే కబ్జా చేసి రహదారి నిర్మించారు. రాత్రికి రాత్రే సీసీ రోడ్డు పుట్టుకు రాగా ఉదయం గమనించిన స్థానికులు దేవాదాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేయడంతో రంగంలోకి దిగిన అధికారులు వేసిన రోడ్డును అమాంతం పెకిలించారు. దేవుని మాన్యం భూములను ఆక్రమించిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. హైటెక్ మండలం శేరిలింగంపల్లిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి...

శేరిలింగంపల్లి మండల పరిధిలోని గోపనపల్లి గ్రామంలో పురాతన రంగనాథ స్వామి దేవాలయం ఉంది. ఈ దేవాలయం మాన్యం కింద గోపనపల్లి వ్యాప్తంగా భూములు ఉన్నాయి. గోపనపల్లి గ్రామ సర్వే నెంబరు 268లో సైతం 13 ఎకరాల రంగనాథుని దేవుని మాన్యం భూమి ఉంది. కాగా ఈ భూమికి ఆనుకొని తెల్లాపూర్ గ్రామ రెవెన్యూ పరిధిలో పలు భారీ బహుళ అంతస్తుల నిర్మాణాలు వెలిశాయి. ఈ నిర్మాణ సముదాయాలకు సరైన రహదారి వసతి లేకపోగా, నిబంధనలకు విరుద్ధంగా అధికారుల జేబులు తడిపి అనుమతులు తెచ్చుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ బహుళ అంతస్తుల అపార్ట్మెంట్లు ప్రస్తుతం నిర్మాణ దశలో ఉండగా, వీటికి రహదారి కోసం నిర్మాణ సంస్థల చూపు పక్కనే ఉన్న రంగనాథ స్వామి దేవుని మాన్యం భూములపై పడింది. ఖాళీగా ఉన్న మాన్యం భూములను ఆక్రమించి రహదారి నిర్మాణం చేపట్టాలని భావించారు అందులో భాగంగా శనివారం అర్థరాత్రి దేవుని మాన్యం భూమిని చదును చేసి రాత్రికి రాత్రే సిసి రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఉదయం విషయం గమనించిన స్థానికులు దేవాదాయ శాఖ అధికారులకు పిర్యాదు చేశారు. దీంతో సంఘటనా స్థలికి చేరుకున్న ఎండోమెంట్ ఇనిస్పెక్టర్ మోహన్ రెడ్డి, ఈఓ సత్యచంద్రారెడ్డిలు రహదారి నిర్మాణ పనులను అడ్డుకున్నారు. దీంతో పాటు గచ్చిబౌలి పోలీసులకు సమాచారం అందించగా, సంఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు రహదారి నిర్మాణంపై విచారణ చేపట్టారు. అనంతరం వేసిన సిసి రోడ్డును జెసిబితో పెకిలించి తొలగించడంతో పాటు ఈ దారిలో రాకపోకలు సాగకుండా కందకం ఏర్పాటు చేశారు. దేవుని మాన్యం భూములను ఆక్రమించి రహదారి నిర్మాణానికి ప్రయత్నించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు.



రంగనాథస్వామి మాన్యం భూములను ఆక్రమించి వేసిన రోడ్డు



నిర్మాణ సంస్థలు వేసిన రోడ్డును తొలగించిన దృశ్యం



రోడ్డును పరిశీలిస్తున్న దేవాదాయ శాఖ అధికారులు, పోలీసులు

# హైదరాబాద్‌లో కుండపోత వాన



ఈ-కబురు, హైదరాబాద్: నగరంలో కుండపోత వాన కురుస్తోంది. వర్షం ధాటికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ అంతరాయం కలిగింది. ఉప్పల్ టూ వరంగల్ రహదారి మార్గంలో ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఆదివారం సాయంత్రం నుంచి మాదాపూర్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఎల్‌బీనగర్, ఉప్పల్, హయత్‌నగర్, టోలీచౌకీ, మియాపూర్, అమీర్‌పేట్, పంజాగుట్ట, అబ్దుల్లాపూర్‌మెట్, పెద్దఅంబర్‌పేట్‌లలో భారీ వర్షపాతం నమోదైంది. కుషాయిగూడా, కాప్రా, ఏఎస్‌రావు నగర్, చర్లపల్లి, ముషీరాబాద్, చిక్కడపల్లి, నారాయణగూడ, అంబర్‌పేట్, నల్లకుంటలలో వర్ష పడుతోంది. దీంతో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. కొన్ని చోట్ల లోతట్టు ప్రాంతాల్లోకి వరద నీరు చేరింది.

# కూలిన అక్రమ నిర్మాణం ప్రహరీ గోడ



కూలిన ప్రహరీ గోడ

**కన్వెన్షన్ సెంటర్ గోడకూలి వ్యక్తి మృతి**

**మరో నలుగురికి గాయాలు**

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :** నగర శివారు పరిధిలోని వట్టినాగులపల్లిలో నిర్మాణంలో ఉన్నఅనుమతి లేని కన్వెన్షన్ సెంటర్ ప్రహరీగోడ కూలి ఓ వ్యక్తి మృతి చెందగా మరో నలుగురు గాయపడ్డారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం... నగర శివారు పరిధిలోని వట్టినాగులపల్లి గ్రామంలో ఉన్న శ్రీదేవి ఇంజనీరింగ్ కళాశాల ముందు ఓ కన్వెన్షన్ సెంటర్ నూతనంగా నిర్మిస్తున్నారు. ఈ కన్వెన్షన్ సెంటర్ కోసం భారీ షెడ్యూల్ అనుమతి లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా యాజమాన్యం చేపడుతుంది. కన్వెన్షన్ సెంటర్ చుట్టూ 10పీట్ల ఎత్తులో ప్రహరీ గోడ నిర్మించారు. కాగా ఆదివారం ప్రహరీగోడకు ఆనుకొని డ్రైనేజీ కాలువ పనులు చేపడుతుండగా ప్రమాదవశాత్తు ప్రహరీ గోడ కూలిపోయింది. ప్రమాద స్థలంలో ఆదిలాబాద్ నుంచి నగరానికి వలస వచ్చి కూలీగా పనిచేస్తున్న శేఖర్ మండల్ 124), బీహార్ రాష్ట్రం మీర్జాపూర్ నుంచి నగరానికి వచ్చిన కుల్తాన్(22), సూర్యపేట నందిగామకు చెందిన కేబుల్ వర్కర్ గుంజ నర్సింహ(21), సూర్యపేటకే చెందిన మరో కేబుల్ వర్కర్ ఉదయ్ మహేశ్వర్(25), బీహార్ రాష్ట్రానికి చెందిన రవి పాశ్వాన్(18)లు పనులు చేస్తున్నారు. కూలిన గోడ వీరి మీద పడడంతో తీవ్ర గాయాలు కాగా క్షతగాత్రులను స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కాగా అప్పటికే శేఖర్ మండల్ మృతి చెందాడు. మరో కూలీ రవి పాశ్వాన్ ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడు. ఈ మేరకు సమాచారం అందుకున్న గచ్చిబౌలి పోలీసులు సంఘటనా స్థలికి చేరుకొని చనిపోయిన శేఖర్ మండల్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

# ఓపెన్ బార్లుగా హైటెక్ సిటీ రహదారులు

**పట్టపగలే ప్రధాన రహదారులపై మందుబాబుల సిట్టింగ్**

**వైన్ షాపుల ముందునుంచి వెళ్లేందుకు జంకుతున్న మహిళలు**

ఈకబురు, శేరిలింగంపల్లి : పేరుకేమో హైటెక్ సిటీ.. కానీ వాస్తవ పరిస్థితి మాత్రం లోటెక్.. జాతీయ, అంతర్జాతీయ ఐటీ సంస్థలు... అడుగడుగునా నిఘా నేత్రాలు... అత్యంత పటిష్ట పోలీసు బందోబస్తు... నిత్యం వీఐపీల సైరన్ మోతలు... ఇది హైటెక్ మండలం శేరిలింగంపల్లికి ఒక వైపు దృశ్యం.. మరోవైపు చూస్తే నిత్యం వేలకొద్ది వాహనాలు ప్రయాణించే ప్రధాన రహదారిపై మహిళలు నడిచి వెళ్లాలంటే భయం భయం.. ఎక్కడో మారుమూల పల్లెల్లో సైతం అర్థరాత్రి ఏ జంకు లేకుండా మహిళలు చిన్నారులు తిరుగుతుండగా ఐటీ కారిడార్ నడిబొడ్డున పట్టపగలు అడుగు వేయాలంటే ఆలోచించాల్సిన పరిస్థితి... ఎందుకంటే హైటెక్ సిటీలో అధికారులకు బాధ్యత గుర్తురాదు... వైన్ షాపులకు నిబంధనలు పట్టవు... మందుబాబులకు పరిసరాలతో పనిలేదు... వైన్ షాపుల లాభాపేక్షకు ప్రధాన రహదారులే మందుబాబుల సిట్టింగ్స్ స్థావరాలుగా మారుతున్నాయి. ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ గోపనపల్లి వైన్ షాపు పరిసరాలు. గతంలో ఇక్కడ ఓపెన్ ప్రదేశాల్లో సిట్టింగ్ కారణంగా హత్యలు చోటు చేసుకున్న సంఘటనలు ఉండగా, వాటి నుంచి వైన్ షాప్ నిర్వాహకులు పాఠాలు నేర్వకపోగా అధికారులు సైతం పట్టించుకోవడం లేదు. దీని కారణంగా గోపన్ పల్లి తండా వైన్ షాపు పరిసర ప్రాంతాలు ఓపెన్ సిట్టింగ్ కేంద్రాలుగా మారుతున్నాయి. వైన్ షాపుకు ఇరువైపులా రహదారులే సిట్టింగ్ స్పాట్లుగా మందుబాబులు చెలరేగుతున్నారు. మిట్ట మధ్యాహ్నం ప్రధాన రహదారిపై కూర్చుని మద్యం సేవిస్తున్న మందుబాబులను అడ్డుకునేవారు లేకుండా పోయారు. దీని కారణంగా ఈ దారిలో ప్రయాణించాలంటే మహిళలు చిన్నారులు వణుకుతున్నారు. గతంలో ఈ వైన్ షాపు నిర్వాహకులపై ఎన్నో ఫిర్యాదులు వచ్చినా ఎక్సైజ్ అధికారులు, చందానగర్ పోలీసులు పట్టనట్టు వ్యవహరించడంతో వైన్ షాప్ నిర్వాహకులు మరింతగా రెచ్చిపోతున్నారు. రహదారిపైనే తినుబండారాలను విక్రయిస్తూ మందుబాబులను రోడ్డుపై కూర్చోబెట్టి మద్యం సరఫరా చేస్తున్నారు. వైన్ షాపు ముందే వాహనాలను నిలిపి అందులోనే మద్యం సేవిస్తున్నారు. మందుబాబుల కారణంగా ఈ దారిలో ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతుండగా, వైన్ షాపు ముందు ప్రతిరోజు ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి.



వైన్ షాప్ పక్కన రహదారిపై మద్యం సేవిస్తున్న మందుబాబులు



వైన్ షాప్ పక్కన రహదారిపై మద్యం సేవిస్తున్న మందుబాబులు



వైన్ షాప్ ముందు రోడ్డుపై వాహనాల రద్దీ

# నందకుమార్ యాదవ్ నివాసానికి విచ్చేసిన బండారు దత్తాత్రేయ



బండారు దత్తాత్రేయతో నందకుమార్ యాదవ్ కుటుంబ సభ్యులు



నందకుమార్ సతీమణిని పరామర్శిస్తున్న దత్తాత్రేయ

ఈకబురు, శేరిలింగంపల్లి : ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిషత్ మాజీ వైస్ ఛైర్మన్ నందకుమార్ యాదవ్ నివాసానికి ఆదివారం కేంద్ర మాజీ మంత్రి, హిమాచల్ ప్రదేశ్, హర్యానా రాష్ట్రాల మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ వచ్చారు. నందకుమార్ యాదవ్ సతీమణి అనురాధ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న బండారు దత్తాత్రేయ ఆదివారం శేరిలింగంపల్లికి వచ్చారు. శేరిలింగంపల్లి గ్రామం రేయిన్ ట్రీ అబాడ్ లోని నందకుమార్ యాదవ్ ఇంటికి వచ్చిన దత్తాత్రేయ నందకుమార్ సతీమణి అనురాధను పరామర్శించారు. అనురాధ త్వరగా కోలువాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు చింతకింది గోవర్ధన్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి తోపుగొండ మహిపాల్ రెడ్డి, నాయకులు రాఘవేందర్ రావు, శాంతి భూషణ్ రెడ్డి, విజయలక్ష్మి, రమణీయమ్మ, రాధ మూర్తి, సత్యనారాయణ, శ్రీనివాస్ రెడ్డి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఇండియా హోమ్ లోన్‌లో వాటా కొనుగోలు



ఇండియా హోమ్‌లోన్ లిమిటెడ్‌లో 24.5% వాటా(34.99 లక్షలకుపైగా షేర్లు) దక్కించుకున్నట్లు స్కైబ్రిడ్జ్ వెంచర్స్ ఎల్‌ఎల్‌పీ తెలిపింది. అయితే, ఎంతకు కొనుగోలు చేసేందనే వివరాలు వెల్లడించలేదు. శుక్రవారం బీఎస్‌ఈలో ఇండియన్ హోమ్ లోన్ షేరు ముగింపు (రూ.42.46)తో లెక్కిస్తే డీల్ విలువ రూ.14.85 కోట్లుగా ఉంటుందని అంచనా.

"ఈ వాటా కొనుగోలుతో భారత్‌లో అందుబాటు ధరల గృహాలు, రిటైల్ ఫైనాన్స్ రంగాల్లో దీర్ఘకాల వృద్ధి అవకాశాలు ఆశిస్తున్నాము. సేవలు విస్తరణకు ఒక బలమైన ప్లాట్‌ఫామ్‌ను ఏర్పాటు చేసుకున్నాము. సంస్థ అభివృద్ధిలో భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉంది" అని స్కైబ్రిడ్జ్ వెంచర్స్ తెలిపింది.

కాగా 2024–25 ఆర్థిక సంవత్సరంలో ఇండియా హోమ్ ఫైనాన్స్ రూ.13.60 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరంలో నమోదైన రూ.12 కోట్లతో పోలిస్తే 13.14% అధికంగా ఉంది.

## జీఎస్టీ సంస్కరణలు దీపావళి ముందే ఎందుకంటే..

కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న జీఎస్టీ సంస్కరణలను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మరోసారి ప్రశంసించారు. ఇది దేశంలోని ప్రతి పౌరుడికీ భారీ విజయమని ఆమె అభివర్ణించారు. చెన్నైలో జరిగిన ఒక కార్యక్రమంలో నిర్మలా సీతారామన్ మాట్లాడారు.

దీపావళి పండుగకు ముందు జీఎస్టీ సంస్కరణల అమలు ఎందుకన్నదానిపైనా ఆర్థిక మంత్రి వివరణ ఇచ్చారు. భారతదేశంలోని ప్రతి రాష్ట్రానికి వారి సొంత పండుగలు ఉంటాయన్న నిర్మలా సీతారామన్.. దీపావళి పండుగకు ముందు జీఎస్టీ సంస్కరణల అమలును ప్రారంభించాలన్న ప్రధాని నరేంద్ర మోదీ ఆదేశాలకు ముందే నిర్ణయించినట్లు నిర్మలా సీతారామన్ చెప్పారు.

చెన్నై సిటిజన్స్ ఫోరం నిర్వహించిన 'ట్యాక్స్ రిఫార్మ్స్ ఫర్ రైజింగ్ భారత్' కార్యక్రమంలో ఆమె ప్రసంగిస్తూ, దేశ ప్రజలు ఉదయం నిద్ర లేచినప్పటి నుంచి రాత్రి నిద్రపోయే వరకు అన్ని ఉత్పత్తులపైనా జీఎస్టీ ప్రయోజనకరమైన ప్రభావం ఉంటుందని ఆమె అన్నారుజీఎస్టీ కింద గతంలో 12 శాతం పన్ను విధించిన 99 శాతం వస్తువులను ఇప్పుడు 5 శాతానికి తగ్గించినట్లు నిర్మలా సీతారామన్ తెలిపారు. జీఎస్టీ సంస్కరణల్లో భాగంగా ఇప్పటివరకు ఉన్న శ్లాబులను రెండు శ్లాబులకే జీఎస్టీ కౌన్సిల్ కుదించింది. ఇకపై 5, 28 శాతం పన్ను శ్లాబులు మాత్రమే కొనసాగనున్నాయి. తాజా జీఎస్టీ సంస్కరణలు సెప్టెంబర్ 22 నుంచి అమల్లోకి రానున్నాయి.



## ఐటీ రిటర్న్‌లకు రేపే ఆఖరు తేదీ




హైదరాబాద్: గత ఆర్థిక సంవత్సరానికి(202425) గాను ఎలాంటి జరిమానాలు లేకుండా ఆదాయపు పన్ను రిటర్నులు (ఐటీఆర్) దాఖలు చేసేందుకు గడువు రేపటితో ముగియనుంది. ఇప్పటికే దాదాపు 6 కోట్లకు పైగా పన్ను చెల్లింపుదారులు ఈ ప్రక్రియను పూర్తి చేసినట్లు ఐటీ విభాగం పేర్కొంది. పన్ను చెల్లింపుదారులకు, పన్ను నిపుణులకు సందేహాలు తీర్చేందుకు 24×7 సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించింది.

ఇవెరిఫై అయిన రిటర్నులు 5.51 కోట్లు ఉన్నాయని, ఇందులో 3.78 కోట్ల వరకూ పరిశీలన పూర్తయ్యిందని పన్ను విభాగం పేర్కొంది. రూ.3 లక్షలకు మించి ఆదాయం ఉన్న వారందరూ త్వరగా రిటర్నులు దాఖలు చేయాలని సూచించింది. కొత్త, పాత పన్ను విధానంలో ఏది ప్రయోజనమో చూసుకోవాలని తెలిపింది. మోసపూరిత మినహాయింపులు చూపించి, రిఫండును కోరడం తప్పు అని, తర్వాత కాలంలో ఇది నోటీసులకు, జరిమానాలకు దారి తీస్తుందని హెచ్చరిస్తోంది.

## అప్పట్లో రూ.179 కోట్ల పెట్టుబడి.. ఇప్పుడు ఎన్నిరెట్ల లాభాలో!

**టాటా క్యాపిటల్ ఐపీఓతో ఐఎఫ్‌సీకి భారీ ప్రతిఫలం**

దిల్లీ: టాటా క్యాపిటల్ నుంచి రాబోతున్న 2 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.17,500 కోట్లు) తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ)తో ప్రపంచ బ్యాంక్ గ్రూప్ సంస్థ ది ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఎఫ్‌సీ) భారీగా లాభాలు గడించనుంది.

2011లో టాటా క్యాపిటల్‌లో పెట్టుబడులు పెట్టిన ఐఎఫ్‌సీ, తాజా ఐపీఓ ద్వారా, ఆ సంస్థలో తన వాటా తగ్గించుకోవాలని చూస్తోంది. ముసాయిదా పత్రాల ప్రకారం.. టాటా క్యాపిటల్‌లో 3.58 కోట్ల షేర్లను ఐఎఫ్‌సీ విక్రయించనుంది. అక్టోబరు మొదటి వారంలో ఈ ఐపీఓ మార్కెట్లలోకి వచ్చే అవకాశం ఉంది.

2011లో టాటా క్లీన్‌టెక్ క్యాపిటల్ లిమిటెడ్ (టీసీసీఎల్)ను ఏర్పాటు చేసేందుకు టాటా క్యాపిటల్‌తో ఐఎఫ్‌సీ భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఈ సంస్థ పునరుత్పాదక, సస్టెయినబుల్ మౌలిక రంగ ప్రాజెక్టులకు రుణాలు ఇస్తుంది. ఆ సమయంలో భారత్‌లో శుద్ధ ఇంధన రంగం రాయితీలపైనే ఆధారపడుతోంది. ఆ తర్వాత టాటా క్యాపిటల్‌లో టీసీసీఎల్ విలీనమైంది. ప్రస్తుతం టాటా క్యాపిటల్‌లో 1.8 శాతానికి సమానమైన 7.16 కోట్ల షేర్లు ఐఎఫ్‌సీ చేతిలో ఉన్నాయి. ఇందులో 3.58 కోట్ల షేర్లను విక్రయించనుంది.

ఒక్కో షేరు రూ.25 చొప్పన ఐఎఫ్‌సీ మొత్తం పెట్టుబడి అప్పట్లో దాదాపు రూ.179 కోట్లుగా ఉంది. రైట్స్ ఇష్యూలో ఒక్కో షేరు ధర రూ.343గా నిర్ణయించడంతో, ఐఎఫ్‌సీ వాటా రూ.2,458 కోట్లకు చేరింది. అంటే ఐఎఫ్‌సీ పెట్టుబడి మీద లాభం 13 రెట్లు పెరిగి రూ.2,278 కోట్లుగా ఉంది. రైట్స్ ఇష్యూ ధర కంటే ఐపీఓలో షేరు విక్రయ ధర మరింత అధికంగా ఉండొచ్చని, దీంతో ఐఎఫ్‌సీ మరింత లాభం ఆర్జించనుందని సంబంధిత వర్గాలు తెలిపాయి.




# లాభాల ఊగిసలాట



**ఫెడ్, ఇతర కేంద్ర బ్యాంకుల నిర్ణయాలు కీలకం**
**బ్యాంకింగ్, ఐటీ షేర్లకు సానుకూలతలు**
**విశ్లేషకుల అంచనాలు**
**స్టాక్ మార్కెట్**

ఈ వారం

దేశీయ సూచీలు ఈ వారమూ తమ ర్యాలీని కొనసాగించే అవకాశాలు మెండుగా ఉన్నాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అయితే వారం ద్వితీయార్థంలో ఊగిసలాటకు గురికావొచ్చంటున్నారు. యూఎస్ ఫెడరల్ రిజర్వ్ (1617 తేదీల్లో)తో పాటు పలు కేంద్ర బ్యాంకులు తమ పరపతి విధాన నిర్ణయాలను వెలువరచనుండడం ఇందుకు నేపథ్యం. ఫెడ్, కీలక రేట్లలో 25 బేసిస్ పాయింట్లు కోత వేయొచ్చన్న అంచనాలున్నాయి. భారత్‌అమెరికా వాణిజ్య చర్చల్లో ప్రగతి ఉందన్న వార్తలు మార్కెట్ సెంటిమెంటును మెరుగుపరుస్తున్నాయి. ఈయూతో ఒప్పందం జరుగుతుందన్న ఆశలూ కలిసివస్తున్నాయి. దేశీయంగా టోకు ద్రవ్యోల్బణ గణాంకాలు ప్రభావం చూపుతాయి. నిఫ్టీ 50 సూచీ 25,100 స్థాయి పైకి వెళితే తాజా కొనుగోళ్లకు ఆసక్తి కనిపిస్తుందని, 25,20025,250 వరకు పరుగు తీయొచ్చని సాంకేతిక నిపుణులు చెబుతున్నారు. సమీప కాలానికి 24,900 కీలక మద్దతు స్థాయిగా కొనసాగగలదని అంటున్నారు.

వివిధ రంగాలపై విశ్లేషకులు ఏమంటున్నారంటే..

నిఫ్టీ బ్యాంక్ రాణించొచ్చు. అంతర్జాతీయ సానుకూల సంకేతాలు ఇందుకు నేపథ్యం. జీఎస్‌టీ 2.0తో వాహన, వినియోగదారు రుణాలు పుంజుకుంటాయన్న అంచనాలున్నాయి. నిఫ్టీ బ్యాంక్‌కు తక్షణ నిరోధం 55,000 పాయింట్ల వద్ద ఉంది. దీనిపైకి వెళితే గనుక రాబోయే వారాల్లో 55,800 స్థాయికి వెళ్లొచ్చు.

రెండు వారాలుగా పరుగులు తీసిన లోహ సూచీ ఈ వారమూ రాణించొచ్చు. చైనాతో సంబంధాలు మెరుగుపడుతుండడం, చైనాలో గిరాకీ రాణించే అవకాశం, ఆ దేశం ఉక్కు ఉత్పత్తిలో కోత వేయాలన్న నిర్ణయాలు ఇందుకు దోహదం చేస్తాయి.

టెలికాం కంపెనీల షేర్లు స్థిరీకరణకు గురికావొచ్చు. అదనపు ఏజీఆర్‌కు సంబంధించి టెలికాం విభాగ ఆదేశాలపై వొడాఫోన్ ఐడియా సుప్రీంలో దాఖలు చేసిన పిటిషన్ పరిణామాలను గమనించాలి. ఎయిర్‌టెల్ రూ.18801930 మధ్య, వొడాఫోన్ రూ.7.307.90 మధ్య కదలాడొచ్చు.

సిమెంటు కంపెనీల షేర్లు చాలా తక్కువ శ్రేణికి లోబడి చలించొచ్చు. వర్షాకాలం ముగిసేదాకా బలహీనంగానే ఉండొచ్చు. మధ్యకాలానికి మాత్రం వీటిపై విశ్లేషకులు ఆశావహంగా కనిపిస్తున్నారు. శ్రీసిమెంట్, అల్ట్రాటెక్, జేకే సిమెంట్‌పై బులిష్‌గా ఉన్నారు.

వరుసగా రెండో వారమూ రాణించిన చమురుగ్యాస్ షేర్లు ఈ వారం పరిమిత శ్రేణికి లోబడే కదలాడొచ్చు. 100, 200 రోజుల సగటు ధరలకు దిగువన చలిస్తుండడం ఇందుకు నేపథ్యం. చమురుగ్యాస్ సూచీకి తక్షణ మద్దతు 10,850 స్థాయి వద్ద కనిపిస్తోంది.

ఎఫ్‌ఎమ్‌సీజీ షేర్లలో పెద్ద కదలికలు ఉండకపోవచ్చు. జీఎస్‌టీ రేట్లకు సంబంధించి ఇప్పటికే ర్యాలీ కనిపించడం ఇందుకు కారణం. గిరాకీ ఒక్కసారిగా పెరగదని కంపెనీలు భావిస్తున్నాయి. బిస్కట్లు చవగ్గా మారాయని ఎక్కువగా కొనరు కదా అని విశ్లేషకులు అంటున్నారు.

జీఎస్‌టీ సానుకూలతలు ఇప్పటికే కనిపించినందున వాహన కంపెనీల షేర్లు స్థిరీకరణకు గురికావొచ్చు. పండగలకు ముందు విక్రయాలు పెరగడం కనిపిస్తే షేర్లు మళ్లీ పుంజుకునే అవకాశం ఉంది.

యంత్రపరికరాల షేర్లు ఒక శ్రేణికి లోబడి చలించొచ్చు. జీఎస్‌టీ రేట్ల కోత వల్ల పన్ను ఆదాయం తగ్గితే, ప్రభుత్వం మూలధన వ్యయాల్లో కోత విధిస్తుందనే అంచనాలున్నాయి. జీఎస్‌టీ రేట్ల కోత వల్ల కంపెనీల వ్యయాలు తగ్గుతాయనీ భావిస్తున్నారు.

ప్రభావం చూపే వార్తలు లేనందున ఔషధ కంపెనీల షేర్లు తక్కువ పరిధిలోనే చలించొచ్చు. జీఎస్‌టీ కోత వల్ల ఫార్మా వ్యాపారాల్లో చాలా తక్కువ భాగంపైనే ప్రభావం పడనుంది. అమెరికా టారిఫ్ అనిశ్చితులే ఈ రంగానికి ప్రధాన ఆందోళనగా ఉన్నాయి. అమెరికా కాంగ్రెస్‌లో చర్చకు వచ్చిన బయోసెక్యూర్ చట్టం నుంచి కొన్ని ఫార్మా షేర్లు లాభపడొచ్చు.

ఐటీ షేర్లు మరిన్ని లాభాలను పొందొచ్చు. ముఖ్యంగా లార్జ్ క్యాప్ కంపెనీలు కొద్ది నెలలుగా దిద్దుబాటుకు గురయి, సహేతుక ధర వద్ద ఉండడం కలిసిరావొచ్చు. అమెరికా హైర్ బిల్లుపై మదుపర్లు ఓ కన్నేయాల్సి ఉంటుంది.

## న్యూయార్క్‌లో ముకేశ్ భారీ కొనుగోలు..!



రిలయన్స్ ఇండస్ట్రీస్ ఛైర్మన్, భారత కుబేరుడు ముకేశ్ అంబానీ విదేశాల్లో అత్యంత విలువైన ఆస్తులను కొనుగోలు చేయడం కొనసాగిస్తున్నారు. తాజాగా అమెరికాలోని న్యూయార్క్‌లో అత్యంత విలాసవంతమైన బిల్డింగ్ కొనుగోలు చేసినట్లు సమాచారం.

న్యూయార్క్‌లోని ట్రైబెకా ప్రాంతంలో భవంతిని 17.4 మిలియన్ డాలర్లు (సుమారు రూ.145 కోట్లు) వెచ్చించి సొంతం చేసుకున్నట్లు రియల్‌డీల్ తాజా నివేదిక వెల్లడించింది.

2023 ఆగస్టులో మాన్‌హాటన్‌లో హడ్సన్ నదికి ఎదురుగా ఉన్న తన 9 మిలియన్ డాలర్ల విల్లాను విక్రయించిన రెండేళ్లకే అంబానీ ఈ కొత్త భవింతిని కొనుగోలు చేశారు. ఈ భవనాన్ని రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎస్) అమెరికా విభాగం కొనుగోలు చేసింది. దీన్ని టెక్ బిలియనీర్ రాబర్ట్ పెరా 2018లో దాదాపు 20 మిలియన్ డాలర్లకు కొనుగోలు చేసి, లగ్జరీ రెసిడెన్స్‌గా మార్చాలని ప్రణాళికలు చేశారు. కానీ అమలు కాలేదు. ఆ తర్వాత 2021లో ఆయన దాన్ని 25 మిలియన్ డాలర్లకు విక్రయానికి పెట్టారు.

**అమెరికా సిస్టమ్స్‌పై ఆధారపడటాన్ని భారత్ తగ్గించుకోవాలి: జీటీఆర్ఐ**

బ్లూంబర్గ్ బిలియనీర్ల ఇండెక్స్ ప్రకారం.. ముకేశ్ అంబానీ సంపద ప్రస్తుతం 97.9 బిలియన్ డాలర్లు (సుమారు రూ.8.2 లక్షల కోట్లు). దీంతో ఆయన దేశంలోనే అత్యంత సంపన్నమైన వ్యక్తిగా అగ్రస్థానంలో కొనసాగుతున్నారు. అలాగే ప్రపంచవ్యాప్తంగా 18వ స్థానంలో నిలిచారు. తరువాత స్థానంలో ఆదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ ఆదానీ ఉండగా.. ఆయన నికర ఆస్తులు 82.1 బిలియన్ డాలర్లని ఆ ఇండెక్స్ తెలిపింది.

# ఏడాది ఆఖర్లో ప్రేమ మొదలు



వైవిధ్యమైన సినిమాలు, యువతరం మెచ్చే సిరీస్‌లను ఎంచుకుంటూ ఆకట్టుకుంటోంది బాలీవుడ్ నాయిక అనన్య పాండే. ఆమె, కార్తిక్ ఆర్యన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'తూ మేరీ మై తేరా.. మై తేరా తూ మేరీ'. రొమాంటిక్ డ్రామా నేపథ్యంలో సరికొత్త ప్రేమకథగా సమీర్ విద్వాన్స్ దీన్ని తెరకెక్కిస్తున్నారు. తాజాగా ఈ సినిమా విడుదల తేదీని అధికారికంగా ప్రకటిస్తూ.. సామాజిక మాధ్యమాల వేదికగా ఓ పోస్ట్ పెట్టింది చిత్రబృందం. "ఈ సంవత్సరం మీ చివరి రోజును మాతో పంచుకోబోతున్నారు. ఈ ఏడాది ముగుస్తుంది కానీ ప్రేమ మొదలవుతుంది. డిసెంబరు 31న థియేటర్లలోకి వస్తోంది చిత్రం" అని వ్యాఖ్యల్ని జోడించింది. ఇందులో రూమిగా అనన్య, రే పాత్రలో కార్తిక్ కనిపించనున్నారు. కరణ్ జోహార్, అపూర్వ మెహతా సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

# రాజాసాబ్ పాటల ప్రయాణం..



'ది రాజాసాబ్'తో సంక్రాంతి బరిలో సందడి చేయనున్నారు కథానాయకుడు ప్రభాస్. ఆయన టైటిల్ పాత్రలో నటిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రాన్ని మారుతి తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థ నిర్మిస్తోంది. ముగింపు దశలో ఉన్న ఈ సినిమా ఈ నెల 18నుంచి కేరళలో కొత్త షెడ్యూల్ ప్రారంభించుకోనుందని సమాచారం. దాదాపు వారం పాటు సాగే ఈ షెడ్యూల్‌లో ప్రభాస్‌పై ఓ పాట చిత్రీకరించనున్నారని.. దీనికి ప్రేమ్ రక్షిత్ మాస్టర్ నృత్యరీతులు అందిస్తారని తెలిసింది. ఇక దీని తర్వాత అక్టోబరులో గ్రీస్‌లో మరో షెడ్యూల్ మొదలు కానుందని.. అక్కడే మూడు పాటలు తెరకెక్కిస్తారని తెలుస్తోంది. రొమాంటిక్ హారర్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా ముస్తాబవుతున్న ఈ సినిమాలో ప్రభాస్ రెండు కోణాలున్న పాత్రలో కనువిందు చేయనున్నట్లు తెలిసింది. ఈ చిత్ర తొలి ట్రైలర్‌ను వచ్చే నెల 'కాంతార: చాప్టర్ 1' సినిమాతో పాటుగా విడుదల చేయనున్నారు. అలాగే మొదటి గీతాన్ని ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా అక్టోబరు 23న బయటకు వదలనున్నారు. ఈ సినిమా జనవరి 9న థియేటర్లలోకి రానుంది. ఈ చిత్రానికి తమన్ సంగీతమందిస్తుండగా.. కార్తీక్ పళని ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తున్నారు.

# చిన్న సినిమాలకు దారి చూపించిన లిటిల్ హార్ట్స్ విజయం




'చిన్న చిత్రాల కోసం ప్రేక్షకులు థియేటర్లకు రారు అనుకుని భయపడే పరిస్థితుల్లో.. 'లిటిల్ హార్ట్స్' విజయం చిన్న సినిమాలకు ఓ దారి చూపించింది. దీన్ని కుటుంబ ప్రేక్షకులు థియేటర్లకు వచ్చి చూస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది'' అన్నారు దర్శకుడు మారుతి. మౌళి తనూజ్, శివానీ నాగారం జంటగా నటించిన ఈ చిత్రాన్ని ఈటీవీ విన్ ఒరిజినల్ ప్రొడక్షన్ పతాకంపై సాయి మార్తాండ్ తెరకెక్కించారు. ఆదిత్య హాసన్ నిర్మాత. ఈ సినిమాని నిర్మాతలు బన్నీ వాస్, వంశీ నందిపాటి ఇటీవలే థియేటర్లలోకి తీసుకురాగా మంచి ప్రేక్షకాదరణ దక్కింది. ఈ నేపథ్యంలోనే తాజాగా హైదరాబాద్‌లో విజయోత్సవ వేడుకను నిర్వహించారు. హీరో అడివి శేష్, మారుతి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అడివి శేష్ మాట్లాడుతూ.. ''ఈ చిత్రంలో మంచి కామెడీతో పాటు ఒక సహజత్వం ఉంది. కామెడీ పంచ్ వేసినవాళ్లు.. తీసుకున్నవాళ్లు ఇద్దరూ హ్యాపీగా ఫీలవుతారు. మౌళికి జోడీగా శివానీని చూసినప్పుడు ఆమె అతని కన్నా వయసులో పెద్దగా ఉన్నట్లు అనిపించింది. కానీ, కాత్యాయిని పాత్ర చూశాక దానికి ఆమెనే ఎందుకు తీసుకున్నారో అర్థమైంది. ఈ చిత్ర ద్వితీయార్థంలో మన సుల్ని హత్తుకునే సన్నివేశాలున్నాయి. మార్తాండ్ దర్శకత్వంలో నాకొక సినిమా చేయాలని ఉంది'' అన్నారు. ''ఈ చిత్రాన్ని చూస్తుంటే నాకు మా 'ఈరోజుల్లో' సినిమా విజయం గుర్తొచ్చింది. ఒక చిన్న సినిమా హిట్టయితే వంద చిత్రాలు తీసే ధైర్యాన్నిస్తుంది. ఈ విజయం మరోసారి ఆ దారిని చూపించింది. ఈటీవీ విన్ ఇలాంటి మంచి ప్రాజెక్ట్స్ మరిన్ని చేయాలని కోరుకుంటున్నా'' అన్నారు దర్శకుడు మారుతి. దర్శకుడు రాహుల్ రవీంద్రన్ మాట్లాడుతూ.. ''ఈ చిత్రం చూసి నేను అందరిలాగే పడీ పడీ నవ్వుకున్నా'' అన్నారు. ఈ కార్యక్రమంలో బీవీఎస్ రవి, కేవీ అనుదీప్, ఎస్‌కేఎన్, వంశీ నందిపాటి తదితరులు పాల్గొన్నారు.

# ఎడారిలో సమరం!

కథానాయకుడు అల్లు అర్జున్ 22వ సినిమా చకచకా చిత్రీకరణ చేసుకుంటున్న సంగతి తెలిసిందే. అట్లీ దర్శకత్వం వహిస్తున్న ఈ బహు భాషా చిత్రాన్ని సన్‌పిక్చర్స్ సంస్థ నిర్మిస్తోంది. గత కొన్ని నెలలుగా ముంబయిలో చిత్రీకరణ చేసుకున్న ఈ సినిమా.. తదుపరి షెడ్యూల్‌ను అబుదాబిలోని లివా ఒయాసిస్ ఎడారిలో ప్రారంభించుకోనుందని సమాచారం. అక్టోబరు నుంచి మొదలు కానున్న ఈ షెడ్యూల్‌లో అల్లు అర్జున్‌పై భారీ పోరాట సన్నివేశాల్ని తెరకెక్కించనున్నట్లు తెలిసింది. ఈ షెడ్యూల్‌లో దీపిక పదుకొణె, మృణాల్ ఠాకూర్‌తో పాటు మరో నాయిక కూడా పాలుపంచుకునే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ఇది సమాంతర ప్రపంచం.. సైన్స్ ఫిక్షన్ అంశాలతో మిళితమై ఉండే కథగా ఉండనుందని.. అల్లు అర్జున్ రెండు పాత్రల్లో అలరిస్తారని వార్తలు వినిపిస్తున్నాయి. రష్మిక, విజయ్ సేతుపతి కీలక పాత్రలు పోషిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది.



# కిస్ మి ఇడియట్ అంటున్న శ్రీలీల.. అదిరిపోయే రీమేక్!



రల్ వయ్యారి శ్రీలీల త్వరలో శివకార్తికేయన్‌కు జంటగా పరాశక్తి చిత్రంతో తమిళ ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతోంది. దీనికంటే ముందు 'కిస్ మీ ఇడియట్' అనే చిత్రంతో తమిళ ప్రేక్షకులను పలకరించడానికి రెడీ అవుతోంది. ఇది ఆమె కన్నడంలో నటించిన రెండవ చిత్రం కిస్‌కు రీమేక్ కావడం గమనార్హం. కన్నడలో కిస్ మూవీ 2019లో విడుదలై శతదినోత్సవం జరుపుకుంది. విరాట్ కథానాయకుడిగా నటించిన ఇందులో రోబో శంకర్, నాంజిల్ విజయమన్, అస్వతి తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు ఏపీ అర్జున్ దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి జయశంకర్ రామలింగం ఛాయాగ్రహణం, ప్రకాష్ నిక్కి సంగీతాన్ని అందించారు.

**కథేంటంటే?**

మాతృకకు పనిచేసిన డైరెక్టర్ అర్జున్ తమిళ వర్షన్‌కూ పని చేస్తున్నారు. కిస్ మీ ఇడియట్ చిత్రం సెప్టెంబర్ 26వ తేదీన తెరపైకి రానుంది. ఈ చిత్ర వివరాలను దర్శకుడు మీడియాకు వెల్లడించాడు. 'కాలేజీలో చదువుకునే శ్రీలీల తన తోటి ...స ఆట పట్టించినందుకు గాను ప్రిన్సిపల్ ఆమెను తరగతి గది నుంచి ఒక రోజు బహిష్కరిస్తాడె. దీంతో కోపంతో బయటికి వచ్చిన శ్రీలీల కళాశాల వెలుపల ప్రిన్సిపల్ ఫొటో ఉన్న బ్యానర్‌పై రాయి విసురుతుంది. ఆ రాయి అటుగా వస్తున్న విరాట్ కారుపై పడటంతో అద్దం పగులుతుంది.

**తప్పని స్థితిలో..**

దీంతో శ్రీలీలను విరాట్ నష్టపరిహారంగా రూ.4 లక్షలు ఇవ్వమని డిమాండ్ చేస్తాడు. లేకపోతే పోలీసులకు ఫిర్యాదు చేస్తానని బెదిరిస్తాడు. అంత డబ్బు తన వద్ద లేదని శ్రీలీల ప్రాధేయ పడితే ఒక ముద్దు ఇవ్వు లేదా తన వద్ద రెండు నెలలు సహాయకురాలిగా పనిచేయమని చెబుతాడు. దీంతో శ్రీలీల అతని వద్ద రెండు నెలలు సహాయకురాలుగా పనిచేయడానికి అంగీకరిస్తుంది. అలా శ్రీలీల విరాట్‌పై ప్రేమ పెంచుకున్న తరుణంలో గడువు పూర్తి కావడంతో ఆమెను పని నుంచి తొలగిస్తాడు. ఆ తర్వాత ఆమె లేకుండా తాను ఉండలేనన్న భావన విరాట్‌కు కలుగుతుంది అలాంటి వారి ప్రేమ ఫలించిందా ? లేదా అన్న పలు ఆసక్తికరమైన అంశాలతో కిస్ మీ ఇడియట్ రూపొందింది అని దర్శకుడు చెప్పారు.

## ఐపీఎల్ కాదు.. దేశం ముఖ్యం



క్రికెట్లోకి వచ్చే పిల్లలు ఐపీఎల్ ఆడడం కాకుండా, భారత్‌కు ప్రాతినిధ్యం వహించడాన్ని లక్ష్యంగా పెట్టుకోవాలని టీమ్‌ఇండియా దిగ్గజ కెప్టెన్ కపిల్ దేవ్ సూచించాడు. 'స్పోర్ట్స్ స్టార్ ప్లేకామ్' సదస్సులో ఆయన మాట్లాడుతూ.. "మా రోజుల్లో క్రికెట్ ఆడితే తల్లిదండ్రులు కొట్టేవాళ్లు. కానీ ఇప్పుడు వాళ్లే ఆటలోకి తీసుకొస్తున్నారు. కానీ తమ పిల్లలు ఐపీఎల్‌లో ఆడాలని తల్లిదండ్రులు లక్ష్యంగా పెట్టుకోవడం నాకు కోపం తెప్పిస్తోంది. దేశానికి ఆడడమే వారి లక్ష్యం కావాలి. క్లబ్ క్రికెట్ ఆడడంలో తప్పు లేదు. కానీ అదే లక్ష్యం కాకూడదు" అని కపిల్ అన్నాడు. తమ రోజుల్లో 50 ఓవర్లలో 100 పరుగులు చేయడం లక్ష్యంగా ఉండేదని.. కానీ ఇప్పుడు టీ20 మ్యాచ్‌లో 300 పరుగులు చేస్తున్నారని.. ఇది మారిన పరిస్థితులు, పెరిగిన క్రికెట్ ప్రతిభకు నిదర్శనమని కపిల్ అన్నాడు. ధోని, రోహిత్‌ల్లో ఎవరు మెరుగైన కెప్టెన్ అని 'ద హిందూ' గ్రూప్ చీఫ్ రెవెన్యూ ఆఫీసర్ సురేశ్ బాలకృష్ణ అడిగిన ప్రశ్నకు సమాధానం ఇస్తూ.. "ధోని చాలా ముందుంటాడు. ఆటలో అన్ని విషయాలపై అతడికి అవగాహన ఉంటుంది. వికెట్ కీపర్ కావడం వల్ల ఆటను లోతుగా పరిశీలించగలుగుతాడు" అని కపిల్ చెప్పాడు.

# పాకిస్తాన్‌పై భారత్ ఘనవిజయం



భారత జట్టు పాకిస్తాన్‌పై మరోసారి తమ బలాన్ని ప్రదర్శించింది. ఏమాత్రం పోటీ లేని మ్యాచ్‌లో ఏకపక్షంగాదాయాది జట్టుపై ఆధిపత్యం ప్రదర్శించి అతి సునాయాస విజయాన్ని అందుకుంది. ఇటీవల పాక్‌తో మ్యాచ్‌తో ఫలితం గురించి ఆలోచించాల్సిన అవసరం లేని విధంగా, అలవాటుగా మారిపోయినట్లుగా, అలవోకగా మరో గెలుపు మన ఖాతాలో చేరింది.

ముందుగా భారత బౌలర్ల సమష్టి ప్రదర్శనతో తేలిపోయిన పాక్ బ్యాటర్లు తక్కువ స్కోరుకే పరిమితం కాగా... ఆ తర్వాత మన ప్రధాన బ్యాటర్లంతా పని పూర్తి చేశారు. దాంతో 25 బంతుల ముందే టీమిండియా ఛేదన ముగిసింది. భారత్‌లో అక్కడక్కడా ఈ మ్యాచ్ ఆడటంపై నిరసనలు, విమర్శలు వినిపించినా... మైదానంలో మాత్రం ప్రేక్షకుల సంఖ్య సంతృప్తికర స్థాయిలో కనిపించింది. టోర్నీ తర్వాతి దశలో ఇరు జట్లు మరోసారి తలపడే అవకాశం ఉంది.

ఈకబురు,దుబాయ్: ఆసియా కప్ టి20 క్రికెట్ టోర్నీలో ఆసక్తిని రేపిన పోరులో భారత్ పైచేయి సాధించింది. ఆదివారం జరిగిన గ్రూప్ 'ఎ' లీగ్ మ్యాచ్‌లో భారత్ 7 వికెట్ల తేడాతో పాకిస్తాన్‌ను చిత్తు చేసింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న పాక్ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 127 పరుగులు చేసింది. సాహిబ్‌జాదా ఫర్హాన్ (44 బంతుల్లో 40; 1 ఫోర్, 3 సిక్స్‌లు), షాహిన్ అఫ్రిది (16 బంతుల్లో 33 నాటౌట్; 4 సిక్స్‌లు) రాణించారు.

భారత బౌలర్లలో కుల్దీప్ యాదవ్ 18 పరుగులిచ్చి 3 వికెట్లు తీయగా... అక్షర్ పటేల్, బుమ్రా చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం భారత్ 15.5 ఓవర్లలో 3 వికెట్లకు 131 పరుగులు సాధించి గెలిచింది. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (37 బంతుల్లో 47 నాటౌట్; 5 ఫోర్లు, 1 సిక్స్), అభిషేక్ శర్మ (13 బంతుల్లో 31; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), హైదరాబాద్ ప్లేయర్ తిలక్ వర్మ (31 బంతుల్లో 31; 2 ఫోర్లు, 1 సిక్స్) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. భారత్ తమ తర్వాతి మ్యాచ్‌లో శుక్రవారం ఒమన్‌తో తలపడుతుంది.

**ఆదుకున్న ఫర్హాన్, అఫ్రిది...**

ఇన్నింగ్స్ తొలి బంతిని 'వైడ్'గా వేసిన పాండ్యా... అదనపు బంతికి సయీమ్ అయూబ్ (0)ను అవుట్ చేశాడు. దాంతో తొలి బంతికే భారత్‌కు వికెట్ దక్కినట్లయింది. అయూబ్ వరుసగా రెండో మ్యాచ్‌లోనూ 'గోల్డెన్ డక్'గా వెనుదిరిగాడు. తర్వాతి ఓవర్లో బుమ్రా రెండో బంతికే మొహమ్మద్ హారిస్ (3)ని వెనక్కి పంపాడు. ఈ దశలో ఫర్హాన్, ఫఖర్ (17) కలిసి జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. బుమ్రా వరుస ఓవర్లలో ఫర్హాన్ ఒక్కో సిక్స్ కొట్టడంతో పవర్‌ప్లే ముగిసేసరికి పాక్ స్కోరు 42 పరుగులకు చేరింది.

పాకిస్తాన్‌పై అటు వన్డేలు, ఇటు టి20ల్లో కలిపి బుమ్రా బౌలింగ్‌లో ఒక పాక్ బ్యాటర్ సిక్స్ కొట్టడం ఇది మొదటిసారి మాత్రమే. అతను వేసిన 400వ బంతికిగానీ ఇది సాధ్యం కాకపోవడం విశేషం! అయితే పవర్‌ప్లే తర్వాత భారత బౌలర్లు ప్రత్యర్థిని పూర్తిగా కట్టి పడేశారు. పరుగులు తీయడంలో పాక్ తీవ్రంగా ఇబ్బంది పడగా, మరో వైపు వరుసగా వికెట్లూ పడ్డాయి. ముగ్గురు భారత స్పిన్నర్లను ఏమాత్రం ఆడలేక పాక్ 19 పరుగుల వ్యవధిలో తర్వాతి 4 వికెట్లు చేజార్చుకుంది.

ఫఖర్, సల్మాన్ ఆగా (3)లను వరుస ఓవర్లలో అక్షర్ వెనక్కి పంపగా... కుల్దీప్ వరుస బంతుల్లో హసన్ (5), నవాజ్ (0) పని పట్టాడు. 7-16 మధ్య 10 ఓవర్లలో పాక్ 2 ఫోర్లు, ఒక సిక్స్‌తో కేవలం 41 పరుగులే చేయగలిగింది. ఒకదశలో వరుసగా 33 బంతుల పాటు బౌండరీనే రాలేదు. అయితే చివర్లో షాహిన్ అఫ్రిది దూకుడుగా ఆడి జట్టుకు గౌరవప్రదమైన స్కోరును అందించాడు. హార్దిక్ వేసిన చివరి ఓవర్లో అతను 2 సిక్స్‌లు బాదాడు.

**అర్ధ సెంచరీ భాగస్వామ్యం...**

ఛేదనను భారత్ జోరుగా మొదలు పెట్టింది. అఫ్రిది వేసిన తొలి ఓవర్లో మొదటి రెండు బంతుల్లో 4, 6 బాదిన అభిషేక్... అతని తర్వాతి ఓవర్లో కూడా ఇలాగే 4, 6 కొట్టాడు. అయితే ఈ రెండు ఓవర్ల మధ్య అయూబ్ బౌలింగ్‌లో వరుసగా రెండు ఫోర్లు కొట్టిన శుబ్‌మన్ గిల్ (7 బంతుల్లో 10) మరుసటి బంతికి వెనుదిరిగాడు. అయూబ్ తర్వాతి ఓవర్లో వరుసగా రెండు ఫోర్లు కొట్టిన అభిషేక్... అదే ఓవర్లో అవుటయ్యాడు.

ఈ దశలో సూర్య, తిలక్ ఎక్కడా తగ్గకుండా ఇన్నింగ్స్‌ను నడిపించారు. తొలి 6 ఓవర్లలో భారత్ 61 పరుగులు చేసింది. ఆ తర్వాత చకచకా పరుగులు రాబట్టిన సూర్య, తిలక్ మూడో వికెట్‌కు 52 బంతుల్లో 56 పరుగులు జోడించారు. విజయానికి చేరువవుతున్న దశలో తిలక్ అవుటైనా...శివమ్ దూబే (10 నాటౌట్)తో కలిసి సూర్య గెలిపించాడు. వీరిద్దరు నాలుగో వికెట్‌కు 21 బంతుల్లో అభేద్యంగా 34 పరుగులు జత చేశారు. సూఫియాన్ బౌలింగ్‌లో మిడ్ వికెట్ మీదుగా సూర్య కొట్టిన భారీ సిక్స్‌తో మ్యాచ్ ముగిసింది.

**10 అంతర్జాతీయ టి20ల్లో పాకిస్తాన్‌పై భారత్ సాధించిన విజయాల సంఖ్య. ఇప్పటి వరకు రెండు జట్ల మధ్య 14 టి20 మ్యాచ్‌లు జరిగాయి. నాలుగింటిలో మాత్రమే పాక్ గెలిచింది.**

**ఆసియా కప్‌లో నేడు**

**యూఏఈ X ఒమన్**

**వేదిక: అబుదాబి**

**సాయంత్రం గం. 5:30 నుంచి**

**శ్రీలంక X హాంకాంగ్**

**వేదిక: దుబాయ్**

**రాత్రి గం. 8:00 నుంచి సోనీ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం**

**స్కోరు వివరాలు**

పాకిస్తాన్ ఇన్నింగ్స్: అయూబ్ (సి) బుమ్రా (బి) పాండ్యా 0; ఫర్హాన్ (సి) పాండ్యా (బి) కుల్దీప్ 40; హారిస్ (సి) పాండ్యా (బి) బుమ్రా 3; ఫఖర్ (సి) తిలక్ (బి) అక్షర్ 17; సల్మాన్ (సి) అభిషేక్ (బి) అక్షర్ 3; హసన్ (సి) అక్షర్ (బి) కుల్దీప్ 5; నవాజ్ (ఎల్బీ) (బి) కుల్దీప్ 0; ఫహీమ్ (ఎల్బీ) (బి) వరుణ్ 11; షాహిన్ అఫ్రిది (నాటౌట్) 33; సూఫియాన్ (బి) బుమ్రా 10; అబ్రార్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 5; మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 127. వికెట్ల పతనం: 1–1, 2–6, 3–45, 4–49, 5–64, 6–64, 7–83, 8–97, 9–111. బౌలింగ్: హార్దిక్ పాండ్యా 3–0–34–1, జస్‌ప్రీత్ బుమ్రా 4–0–28–2, వరుణ్ చక్రవర్తి 4–0–24–1, కుల్దీప్ యాదవ్ 4–0–18–3, అక్షర్ పటేల్ 4–0–18–2, అభిషేక్ శర్మ 1–0–5–0.

భారత్ ఇన్నింగ్స్: అభిషేక్ (సి) ఫహీమ్ (బి) అయూబ్ 31; గిల్ (స్టంప్డ్) హారిస్ (బి) అయూబ్ 10; సూర్యకుమార్ (నాటౌట్) 47; తిలక్ వర్మ (బి) అయూబ్ 31; దూబే (నాటౌట్) 10; ఎక్స్‌ట్రాలు 2; మొత్తం (15.5 ఓవర్లలో 3 వికెట్లకు) 131. వికెట్ల పతనం: 1–22, 2–41, 3–97. బౌలింగ్: షాహిన్ అఫ్రిది 2–0–23–0, అయూబ్ 4–0–35–3, అబ్రార్ 4–0–16–0, నవాజ్ 3–0–27–0, సూఫియాన్ 2.5–0–29–0.

**'షేక్ హ్యాండ్' లేదు!**

సాధారణంగా టాస్ వేసిన తర్వాత ఇరు జట్ల కెప్టెన్లు చేతులు కలపడం ఆనవాయితీ. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో ఇది కానీ, ఒక చిరునవ్వు కానీ వివాదానికి, అనవసరపు చర్చకు దారి తీసే అవకాశం ఉంది. అందుకే కావచ్చు అటు సూర్యకుమార్ యాదవ్ గానీ ఇటు సల్మాన్ ఆగా కానీ అందుకు సాహసించలేదు. 'షేక్ హ్యాండ్' ఇవ్వకుండా, కనీసం ఒకరి వైపు మరొకరు చూడకుండా ఇద్దరూ చెరో వైపునకు వెళ్లిపోయారు. మ్యాచ్ ముగిసిన తర్వాత కూడా ఇరు జట్ల ఆటగాళ్లు కరచాలనం చేసుకోకుండా వెళ్లిపోయారు.

టోర్నీ ఆరంభానికి ముందు జరిగిన కెప్టెన్ల సమావేశంలో ఏసీసీ అధ్యక్షుడు, పీసీబీ చైర్మన్ మొహసిన్ నఖ్వీకి సూర్యకుమార్ షేక్ హ్యాండ్ ఇవ్వడం మన అభిమానులకు అసంతృప్తిని కలిగించింది. ఆ ఒక్క విజువల్‌ను మళ్లీ మళ్లీ చూపిస్తూ సోషల్ మీడియాలో అంతా సూర్యను, బీసీసీఐని ఆడుకున్నారు. దాంతో ఈసారి అతను కూడా జాగ్రత్త పడ్డాడు!



# అటు సెవిల్లె... ఇటు మెలిస్సా



**మహిళల విభాగంలో అమెరికా అథ్లెట్ 'టాప్'**

**పురుషుల విభాగంలో జమైకా చిరుతకు పసిడి పతకం**

**100 మీటర్ల పరుగులో ప్రపంచ చాంపియన్‌లు**

టోక్యో: ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో జమైకా కొత్త చిరుత ఒబ్లిక్ సెవిల్లె పురుషుల 100 మీటర్ల స్వర్ణం కైవసం చేసుకున్నాడు. ఆదివారం జరిగిన ఫైనల్ రేసును ఒబ్లిక్ 9.77 సెకన్లలో ముగించి అగ్రస్థానం దక్కించుకున్నాడు. ఉసెన్ బోల్ట్ (2016) తర్వాత ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పసిడి పతకం నెగ్గిన తొలి జమైకా రన్నర్‌గా ఒబ్లిక్ సెవిల్లె నిలిచాడు. సెవిల్లెకు ఇదే వ్యక్తిగత అత్యుత్తమ ప్రదర్శన కాగా... జమైకాకే చెందిన ఒలింపిక్ రజత పతక విజేత కిషానె థామ్సన్ (9.82 సెకన్లు) రజతం దక్కించుకున్నాడు.

డిఫెండింగ్ చాంపియన్, అమెరికా అథ్లెట్ నోవా లైల్స్ (9.89 సెకన్లు) కాంస్యం గెలుచుకున్నాడు. 'ప్రపంచ చాంపియన్‌షిప్ పురుషుల 100 మీటర్ల పరుగులో ఉసెన్ బోల్ట్ తర్వాత జమైకా అథ్లెట్‌కు స్వర్ణం దక్కడం ఇదే తొలిసారి. ఈ టోర్నీ కోసం పూర్తి స్థాయిలో సన్నద్ధమయ్యా. సెమీస్‌లో నా ప్రదర్శనతో సంతృప్తిపడలేకపోయా. ఫైనల్లో శక్తినంతా కూడగట్టుకొని ప్రయత్నించా. నా పూర్తి సామర్థ్యంతో పరుగు తీస్తే... అందరికంటే ముందు నిలవగలనని విశ్వసించా' అని 24 ఏళ్ల సెవిల్లె వెల్లడించాడు.

పోటీలో ఉన్న అందరిలో అత్యుత్తమ వ్యక్తిగత టైమింగ్ ఉన్న థామ్సన్ ఆరంభంలోనే వెనుకబడిపోయాడు. ఇక అక్కడి నుంచి ఏ దశలోనూ సెవిల్లెను వెనక్కి నెట్టలేకపోయిన ఈ జమైకా అథ్లెట్ రెండో స్థానంతో సంతృప్తి పడాల్సి వచ్చింది.

మహిళల 100 మీటర్లలో అమెరికా అథ్లెట్ మెలిస్సా జెఫర్సన్ వుడెన్ విజేతగా నిలిచింది. ఫైనల్లో మెలిస్సా 10.61 సెకన్లలో లక్ష్యాన్ని చేరి విజేతగా అవతరించింది. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ఇది సంయుక్తంగా అత్యుత్తమ టైమింగ్ కాగా... రెండో స్థానంలో నిలిచిన టీనా క్లాటన్ కంటే 0.15 సెకన్ల ముందే మెలిస్సా రేసు పూర్తి చేసింది. వరల్డ్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఇదే అత్యధిక గెలుపు వ్యత్యాసం.

జమైకాకు చెందిన టీనా క్లాటన్ (10.76 సెకన్లు), జూలియన్ అల్‌ఫ్రెడ్ (10.84 సెకన్లు; సెయింట్ లూసియా) వరుసగా రజత, కాంస్యాలు దక్కించుకున్నారు. జమైకా స్టార్ అథ్లెట్ షెల్లీ ఆన్ ఫ్రెజర్ ప్రైస్ 11.3 సెకన్లతో ఆరో స్థానానికి పరిమితమైంది.

రెండో రోజు పోటీలు ముగిసేసరికి అమెరికా 5 స్వర్ణాలు, ఒక కాంస్యంతో మొత్తం 6 పతకాలు సాధించి పట్టిక అగ్రస్థానంలో కొనసాగుతుండగా... కెన్యా (2 స్వర్ణాలు), జమైకా (1 స్వర్ణం, 2 రజతాలు) వరుసగా రెండో, మూడో స్థానాల్లో ఉన్నాయి. కెనడా, ఫ్రాన్స్, స్పెయిన్ కూడా ఒక్కో పసిడి పతకం ఖాతాలో వేసుకున్నాయి.

# జైస్మీన్, మీనాక్షి 'పసిడి' పంచ్



**భారత మహిళా బాక్సర్లకు రెండు స్వర్ణాలు**

**రజతం నెగ్గిన నుపుర్**

**పూజా రాణి ఖాతాలో కాంస్యం**

లివర్‌పూల్ (ఇంగ్లండ్): ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత మహిళా బాక్సర్లు నాలుగు పతకాలతో మెరిశారు. జైస్మీన్ లంబోరియా (57 కేజీలు), మీనాక్షి హుడా (48 కేజీలు) పసిడి పతకాలతో అదరగొట్టగా... నుపుర్ షెరాన్ (ప్లస్ 80 కేజీలు) రజత పతకం, పూజా రాణి (80 కేజీలు) కాంస్య పతకం సొంతం చేసుకున్నారు. ఆదివారం ముగిసిన ఈ మెగా ఈవెంట్‌లో హరియాణాకు చెందిన మీనాక్షి ఫైనల్లో 4-1తో పారిస్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత కిజైబీ నజిమ్ (కజకిస్తాన్)ను బోల్తా కొట్టించి తన కెరీర్‌లో చిరస్మరణీయ విజయాన్ని అందుకుంది. గత జూలైలో జరిగిన ప్రపంచకప్ ఫైనల్లో కిజైబీ చేతిలో ఎదురైన పరాజయానికి మీనాక్షి ఈ గెలుపుతో బదులు తీర్చుకుంది. శనివారం అర్ధరాత్రి దాటాక జరిగిన 57 కేజీల ఫైనల్లో హరియాణాకే చెందిన జైస్మీన్ 4-1తో పారిస్ ఒలింపిక్స్ రజత పతక విజేత జూలియా జెరెమెటా (పోలాండ్)ను ఓడించి విశ్వవిజేతగా అవతరించింది. 'నా అనుభూతిని మాటల్లో వర్ణించలేను.

గత రెండు ప్రపంచ చాంపియన్‌షిప్‌లలో క్వార్టర్ ఫైనల్స్‌లో వెనుదిరిగాను. ఈసారి ఎలాగైనా విజేతగా తిరిగి రావాలనే లక్ష్యంతో నా ఆటతీరులో మార్పులు చేసుకొని అనుకున్న ఫలితాన్ని సాధించాను' అని జైస్మీన్ వ్యాఖ్యానించింది. ప్లస్ 80 కేజీల ఫైనల్లో నుపుర్ 2-3తో అగాటా కమర్స్‌కా (పోలాండ్) చేతిలో పోరాడి ఓడిపోయింది. 80 కేజీల సెమీఫైనల్లో పూజా రాణి 1-4తో ఎమిలీ (ఇంగ్లండ్) చేతిలో పరాజయం పాలై కాంస్య పతకాన్ని దక్కించుకుంది. 10 ప్రపంచ చాంపియన్‌షిప్ చరిత్రలో స్వర్ణ పతకాలు నెగ్గిన భారత మహిళా బాక్సర్లు. ఈ జాబితాలో మేరీకోమ్, నిఖత్ జరీన్, సరితా దేవి, జెన్నీ, లేఖ, నీతూ, లవ్లీనా, స్వీటీ బూరా, జైస్మీన్, మీనాక్షి ఉన్నారు.

# తొలి వన్డే ఆసీస్‌దే



ముల్లాన్‌పుర్: ప్రపంచకప్‌నకు సన్నాహకంగా ఆస్ట్రేలియాతో మూడు వన్డేల సిరీస్ ఆడుతున్న భారత మహిళల జట్టుకు శుభారంభం దక్కలేదు. క్యాచ్‌లు వదిలేసి.. బౌలింగ్‌లో విఫలమైన హర్మన్‌ప్రీత్ బృందం తొలి వన్డేలో 8 వికెట్ల తేడాతో ఆసీస్ చేతిలో ఓడింది. మొదట భారత్ 7 వికెట్లకు 281 పరుగులు చేసింది. ప్రతీక రావల్ (64), స్మృతి మంధాన (58) సత్తా చాటారు. హర్లీన్ డియోల్ (54) రాణించడంతో భారత్ మెరుగైన స్కోరు చేసింది. ఛేదనలో ఆసీస్ దూకుడుగా ఆడింది. ఓపెనర్లు ఫోబి లిచ్‌ఫీల్డ్ (88), అలీసా హీలీ (27) తొలి వికెట్‌కు 45 పరుగులు జోడించి శుభారంభం అందించారు. తర్వాత పెర్రీ (30)తో కలిసి లిచ్‌ఫీల్డ్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించింది. బెత్ మూని (77 నాటౌట్), అనాబెల్ (54 నాటౌట్) చెలరేగడంతో ఆసీస్ 44.1 ఓవర్లలో 2 వికెట్లే కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది.